News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in :
www.cknewstv.in

# CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 03 | సంచిక :280 | ఖమ్మం | శుక్రవారం నవంబర్ 21, 2025 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

## 3 దశల్లో పంచాయతీ ఎన్నికలు

- డిసెంబరు మూడో వారం కంటే ముందే నిర్వహణ?
- ఈ నెల 25 లేదా 26న షెడ్యూలు
- నేడు తేదీల ఖరారుకు అవకాశం
- 22, 23 తేదీల్లో జిల్లాల్లో రిజర్వేషన్ల ఖరారు
- కలెక్టర్లతో ఎన్నికల సంఘం వీడియో కాన్ఫరెన్స్



తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికలను డిసెంబరు మూడో వారం కంటే ముందే నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం (ఈసీ) సూత్రప్రాయంగా నిర్ణయించింది. దీనికి అనుగుణంగా ఈ నెల 25 లేదా 26 తేదీల్లో షెడ్యూలు ప్రకటించేందుకు సన్నద్ధమవుతోంది. దీనిపై ప్రభుత్వం శుక్రవారం తుది నిర్ణయం తీసుకోనుంది. రాష్ట్రంలో గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించిన ప్రభుత్వం ఈ మేరకు ఎన్నికల సంఘానికి ఆదేశాలివ్వగా, ఆ మేరకు ఈసీ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. డిసెంబరు 10, 13, 16 తేదీల్లో లేదంటే 11, 14, 17 తేదీల్లో పోలింగ్ కోసం రెండు ప్రతిపాదనలు ఇచ్చింది. స్థానిక ఎన్నికల నిర్వహణపై ఈ నెల 24న హైకోర్టులో విచారణ జరగనుంది. 50% రిజర్వేషన్లతో ఎన్నికలకు అనుమతినిస్తే ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తుంది. ఈ నెల 25న జరగనున్న మంత్రిమండలి సమావేశంలో దీనికి ఆమోదం చెబుతారు. అదేరోజు లేదంటే మరుసటి రోజు ఎన్నికల షెడ్యూలు వెలువడుతుంది. 50% రిజర్వేషన్ల ప్రాతిపదికన రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖకు నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం డెడికేటెడ్ కమిషన్‌ను ఆదేశించింది. ఈ మేరకు కమిషన్ గురువారం నివేదిక ఇచ్చింది. ఈ నేపథ్యంలో

వివరాలు 2లో..

## అన్ని మతాలపై నమ్మకం ఉందిగానీ.. బౌద్ధాన్ని అనుసరిస్తున్నా

### సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్



బౌద్ధమతాన్ని తాను అనుసరిస్తున్నానని.. అయితే అన్ని మతాలపై తనకు విశ్వాసం ఉందని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బి.ఆర్.గవాయ్ పేర్కొన్నారు. ఈనెల 23న పదవీవిరమణ చేయనున్న ఆయన.. సుప్రీంకోర్టు అడ్వకేట్ ఆన్ రికార్డ్స్ అసోసియేషన్ (స్కోరా) గురువారం ఇక్కడ ఏర్పాటుచేసిన వీడ్కోలు కార్యక్రమంలో మాట్లాడారు."నేను పూర్తిగా

వివరాలు 2లో..



# కేటీఆర్ విచారణకు గవర్నర్ ఓకే

## ఫార్ములా ఈ రేసు కేసులో కీలక మలుపు

### 70 రోజుల తర్వాత అనుమతిచ్చిన జిష్ణుదేవ్

- ఏ1గా ఉన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్
- త్వరలోనే చార్జిషీట్ వేయనున్న ఏసీబీ ఆఫీసర్లు
- ఏ2గా అరవింద్ కుమార్.. ప్రాసిక్యూషన్ కోసం డీవోపీటీకి లేఖ రాసిన సర్కారు
- అనుమతి రాగానే ఆయనపైనా చట్టపరమైన చర్యలు?

వివరాలు 2లో..

మాజీ మంత్రి కేటీఆర్కు బిగ్ షాక్ తగిలింది. ఫార్ములా ఈ-రేసు కేసుకు సంబంధించి మాజీ మంత్రి కేటీఆర్ను విచారించడానికి గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఆమోదం తెలిపారు. నిధుల దుర్వినియోగంపై విచారణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఏసీబీ త్వరలో కేటీఆర్పై అభియోగాలు నమోదు చేయనుంది. విచారణ తర్వాత చార్జ్ షీట్ దాఖలు చేసే అవకాశం ఉంది. దీంతో, ఇప్పుడు ఈ కేసులో కేటీఆర్పై తదుపరి చర్యలపై ఉత్కంఠ కొనసాగుతోంది.

## రసకందాయంలో 'కర్నాటకం'

- సిద్ధరామయ్య, డీకే పోటాపోటీ
- అధికార పంపిణీపై పట్టు



కర్ణాటకలో అధికార కాంగ్రెస్‌లో రాజకీయం వేడెక్కింది. 2023 విధానసభ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కాంగ్రెస్.. గద్దెనెక్కిన నాటి నుంచీ రెండున్నరేళ్ల తర్వాత అధికార పంపిణీ ఉంటుందని ప్రచారంలో ఉంది. గురువారంతో సిద్ధరామయ్య నేతృత్వంలోని సర్కారుకు రెండున్నరేళ్లు నిండాయి. ఈ నేపథ్యంలో అసలు రాజకీయం మొదలైంది. బిహార్ ఎన్నికల పరాభవం నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్ఠానం కర్ణాటక రాజకీయాలపై ఇంకా దృష్టి సారించలేకపోయింది.

వివరాలు 2లో..




## కొలువుదీరిన నీతీశ్ ప్రభుత్వం

- మోదీ, అమిత్ షా, నడ్డా, చంద్రబాబుసహా ఎన్డీయే నేతల హాజరు
- 26 మంది మంత్రుల ప్రమాణం

పట్నా: బిహార్‌ను సుదీర్ఘకాలంగా పాలిస్తున్న జేడీయూ అధినేత నీతీశ్ కుమార్.. గురువారం పదోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, నడ్డా, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు సహా ఎన్డీయే నేతలు హాజరుకాగా భారీ జనసందోహం మధ్య ఆయన ప్రమాణం చేశారు. పట్నాలోని గాంధీ మైదానంలో ఏర్పాటు చేసిన వేదికపై నీతీశ్, 26 మంది మంత్రులతో గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ ప్రమాణం చేయించారు. భాజపా నుంచి 14 మంది,

వివరాలు 2లో..

## 'తెలంగాణ రైజింగ్: విజన్ 2047'

### సలహా మండలిలో అభిజిత్ బెనర్జీ సహా వివిధ రంగాల ప్రముఖులు

TELANGANA RISING 2047



- సలహా మండలిలో మాజీ అధికారులు, ఆర్బీఐ మాజీ గవర్నర్లు
- కిరణ్ మంజుందార్ షా, అరవింద్ సుబ్రమణియన్‌లకు చోటు
- ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసిన ప్లానింగ్ డిపార్టుమెంట్

వివరాలు 2లో..

## రాష్ట్రపతి,గవర్నర్లకు కోర్టులు గడువు విధించలేవు

- బిల్లులకు సమ్మతిలో తీవ్ర జాప్యాన్ని ఆమోదంగా భావించాలనడమూ రాజ్యాంగంలో లేదు
- గవర్నర్లు బిల్లులను నిరవధికంగా నిలిపివేయడం తగదు
- అసాధారణ నిష్క్రియ పరిస్థితుల్లోనే న్యాయస్థానాల జోక్యం..
- ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్‌కు సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం సమాధానం
- ఏకాభిప్రాయంతో ఐదుగురు న్యాయమూర్తుల తీర్పు



శాసనసభలు ఆమోదించి పంపించిన బిల్లులకు సమ్మతి తెలిపే విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు న్యాయస్థానాలు గడువు విధించలేవని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. నిర్దిష్ట గడువులోగా సమ్మతి/అభిప్రాయం తెలియజేయకపోతే ఆ బిల్లులను ఆమోదించినట్లుగా భావించడమూ రాజ్యాంగంలో లేదని, అధికారాల విభజన సూత్రానికి ఇది వ్యతిరేకమని పేర్కొంది. శాసన నిర్మాణంలో రాష్ట్రపతి, గవర్నర్లు నిర్వర్తించాల్సిన విధుల్ని మరే వ్యవస్థా భర్తీ చేయలేదని స్పష్టం చేసింది. దేశ సమాఖ్య వ్యవస్థలో గవర్నర్లు నిర్వహిస్తున్న పాత్రపై తీవ్ర చర్చకు దారి తీసిన 'రాష్ట్రాల

వివరాలు 2లో..

## గనుల వేలంతో పెట్టుబడిదారుల్లో నమ్మకం



దేశంలో గనుల కేటాయింపునకు వేలం విధానం ప్రవేశపెట్టిన తర్వాత ఇప్పటి వరకు 500కిపైగా గనులకు వేలం నిర్వహించామని... పారదర్శకత పెరగడంతో పెట్టుబడిదారుల్లో నమ్మకం ఏర్పడిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ) 175వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం రాజస్థాన్ రాజధాని జైపుర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

వివరాలు 2లో..

## దేశ వ్యాప్తంగా సన్నబియ్యం ఇవ్వండి

- ప్రజలు తినే బియ్యం ఇస్తేనే పథకం ఉద్దేశం నెరవేరుతుంది
- ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలించాలి
- కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషితో సీఎం రేవంత్ రెడ్డి



వివరాలు 2లో..

# 'తెలంగాణ రైజింగ్: విజన్ 2047'

## సలహా మండలిలో అభిజిత్ బెనర్జీ సహా వివిధ రంగాల ప్రముఖులు

'తెలంగాణ రైజింగ్: విజన్ 2047' కోసం తెలంగాణ ప్రభుత్వం విభిన్న రంగాలకు చెందిన ప్రముఖులతో కూడిన సలహా మండలిని ఏర్పాటు చేసింది. నోబెల్ గ్రహీత, ప్రముఖ ఆర్థికవేత్త అభిజిత్ బెనర్జీ, మాజీ ఐఏఎస్ అధికారులు అరుణా రాయ్, హర్ష్ మందార్, భారత రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్‌లు దువ్వూరి సుబ్బారావు, రఘురామ్ రాజన్, బయోకాన్ ఛైర్‌పర్సన్ కిరణ్ మజుందార్ షా, మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ తదితరులు ఈ సలహా మండలిలో సభ్యులుగా ఉంటారు.

సీఐఐ మాజీ అధ్యక్షురాలు, ప్రథమ్ సీఈవో రుక్మిణీ బెనర్జీ, ఐక్యరాజ్యసమితి ఉన్నత స్థాయి సలహా బోర్డు సభ్యురాలు జయతి ఘోష్, రామన్ మెగసెసే అవార్డు గ్రహీత బెజవాడ విల్సన్, ఆర్థికవేత్త మరియు పబ్లిక్ పాలసీ నిపుణుడు డాక్టర్ సంతోష్ మెహ్రోత్రా, డిజిటల్ సృజనాత్మకత, ఎంటర్‌ప్రైజ్ సొల్యూషన్స్‌లో నిపుణులు శాంతను నారాయణ్, ప్రముఖ ఆర్థికవేత్త ప్రొఫెసర్ హిమాన్షు, ప్రముఖ వాతావరణ నిపుణులు అరుణాభ ఘోష్, ప్రముఖ కాలమిస్ట్ మోహన్ గురుస్వామి సలహా మండలిలో ఇతర సభ్యులుగా వ్యవహరిస్తారు.'తెలంగాణ రైజింగ్: విజన్ 2047'కు వ్యూహాత్మక దిశానిర్దేశం, సూచనలు, సమీక్ష కోసం ఈ సలహా మండలిని ఏర్పాటు చేస్తూ ప్రణాళిక శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.తెలంగాణ ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్: విజన్ 2047' పేరుతో ఒక దీర్ఘకాలిక అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇది రాబోయే 25 సంవత్సరాలలో రాష్ట్రం కోసం ఒక పరివర్తనాత్మక అభివృద్ధి ప్రణాళిక ఇది. సమగ్ర ఆర్థిక వృద్ధి, సుస్థిర అభివృద్ధి, పౌరులందరికీ సమాన అవకాశాలు సాధించడం దీని ప్రధాన లక్ష్యాలు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ సలహా మండలి 'తెలంగాణ రైజింగ్: విజన్ 2047'పై వ్యూహాత్మక పర్యవేక్షణ, మార్గదర్శనం చేస్తుంది.

# కొలువుదీరిన నీతీశ్ ప్రభుత్వం

-మొదటిపేజీ తరువాయి

జేడీయూ నుంచి 8 మంది, ఎల్జేపీ నుంచి ఇద్దరు, హెచ్ఏఎం, ఆర్ఎల్ఎంల నుంచి ఒక్కొక్కరు మంత్రులుగా ప్రమాణం చేశారు. ఇందులో గత ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంలుగా పనిచేసిన భాజపా నేతలు సామ్రాట్ చౌధరి, విజయ్ కుమార్ సిన్హా ఉన్నారు.

గత ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్న భాజపా నేతలు మంగళ్ పాండే, నితిన్ నబీన్, సురేంద్ర ప్రసాద్ మెహతా మళ్లీ మంత్రులయ్యారు. ఒకరికి ఒకే పదవి నిబంధనతో రెండేళ్ల కిందట మంత్రి పదవికి రాజీనామా చేసిన భాజపా రాష్ట్రశాఖ అధ్యక్షుడు దిలీప్ జయస్వాల్ మళ్లీ మంత్రిగా ప్రమాణం చేశారు.

అంతర్జాతీయ షూటర్ శ్రేయాసీ సింగ్ కొత్తగా మంత్రి అయ్యారు. ఇంకా కొత్తగా మంత్రులైన వారిలో అరుణ్ శంకర్ ప్రసాద్, ప్రమోద్ కుమార్, లఖేంద్ర కుమార్ రౌషన్, సంజయ్ సింగ్ టైగర్, రమా నిషాద్ ఉన్నారు.

జేడీయూ నుంచి మంత్రులైన వారంతా గత ప్రభుత్వంలో ఉన్నవారే. ఎన్డీయేలోని ఏకైక ముస్లిం ఎమ్మెల్యే జమా ఖాన్ మంత్రిగా ప్రమాణం చేశారు.

సీఎంతోపాటు మంత్రులైన వారిలో దిలీప్ జయస్వాల్, ప్రమోద్ కుమార్, అశోక్ చౌధరి, సంతోశ్ సుమన్‌లు మండలి సభ్యులు.

బిహార్‌లో 36 మంది మంత్రులయ్యేందుకు అవకాశం ఉంది.

**మోదీ కాళ్లు మొక్కబోయిన నీతీశ్**

తన ప్రమాణ స్వీకార కార్యక్రమం కోసం వచ్చిన ప్రధాని మోదీ కాళ్లను మొక్కడానికి నీతీశ్ ప్రయత్నించారు. విమానాశ్రయంలో ప్రధానికి స్వాగతం పలికే సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రధాని కాళ్లను మొక్కేందుకు నీతీశ్ ప్రయత్నిస్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో ప్రసారమైంది. మోదీ వెంటనే నీతీశ్ భుజాలను పట్టుకుని లేపి దగ్గరికి తీసుకుని భుజం భుజం కలిపారు. గత ఏడాది లోక్‌సభ ఎన్నికల ప్రచారం సందర్భంలోనూ నీతీశ్ ఇలాగే చేయబోయారు. మోదీ కంటే నీతీశ్ కొన్ని నెలల చిన్నవారు.

**గమ్ఛా తిప్పిన ప్రధాని.. ఉర్రూతలూగిన జనం**

ప్రమాణ వేడుకలో ఉత్సాహంగా కండువా తిప్పుతున్న ప్రధాని మోదీ. చిత్రంలో బిహార్ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్, నీతీశ్

నీతీశ్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వచ్చిన జనంతో పట్నాలోని గాంధీ మైదానం కిక్కిరిసిపోయింది. దాదాపు 3 లక్షల మంది వచ్చారని అంచనా. ప్రమాణ స్వీకారం అనంతరం ప్రధాని గమ్ఛా (కండువా) తిప్పి కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు.

**రాజకీయాల్లోకి రావడంపై నోరువిప్పని నీతీశ్ కుమారుడు**

ఎన్డీయే ప్రభుత్వానికి ఓటేసిన బిహార్ ప్రజలకు నీతీశ్ కుమారుడు నిశాంత్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా కులమతాలకతీతంగా మహిళలు నీతీశ్ వెంట నడుస్తున్నారని పేర్కొన్నారు. మీరు రాజకీయాల్లోకి ఎప్పుడు వస్తున్నారని ప్రశ్నించగా.. నవ్వుతూ వెళ్లిపోయారు. ఆయన ఎప్పుడూ ఎన్నికల్లో పోటీ చేయలేదు. ప్రజా జీవితానికి దూరంగానే ఉన్నారు.

# రసకందాయంలో 'కర్నాటకం'

-మొదటిపేజీ తరువాయి

ఈ నేపథ్యంలో సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ మద్దతుదారులు ఒక్కొక్కరుగా దిల్లీకి వెళ్లి వస్తూ రాష్ట్ర రాజకీయాలను వేడెక్కిస్తున్నారు.

విస్తరణకు పట్టు

బిహార్ ఎన్నికల ఫలితాలు వెల్లడైన మర్నాడే ముఖ్యమంత్రి సిద్ధరామయ్య దిల్లీ వెళ్లారు. లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలతో వేర్వేరుగా సమావేశమైన ఆయన మంత్రివర్గ విస్తరణకు అవకాశం ఇవ్వాలని కోరారు. మంత్రివర్గ విస్తరణకు అవకాశమిస్తే మరో ఏడాది పాటు ముఖ్యమంత్రి పదవికి ఢోకా ఉండదన్న అంచనాతో సిద్ధరామయ్య ఈ ప్రతిపాదన చేశారు. దీనిపై ఖర్గేతో మాట్లాడాలని రాహుల్ ఆయనకు సూచించారు. ఖర్గే ఇంతవరకు మంత్రివర్గ విస్తరణపై సీఎంకు సలహా ఇవ్వకపోవటం గమనార్హం. అధికార పంపిణీ అంశాన్ని మొదటి నుంచీ తోసిపుచ్చుతున్న సిద్ధరామయ్య ఐదేళ్లూ సీఎంగా తానే కొనసాగుతానని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం 136 మంది ఎమ్మెల్యేల్లో అత్యధికులు తనకు మద్దతుగా ఉన్నారని ఆయన విశ్వసిస్తున్నారు. అధికార పంపిణీ జరగాల్సి వస్తే ఎమ్మెల్యేల అభిప్రాయమే కీలకమని ప్రకటించి డీకే శిబిరంలో అలజడి రేపుతున్నారు. గురువారం ఈ విషయంపై మరింత స్పష్టత ఇస్తూ తాను అధిష్ఠానంతో అధికార పంపిణీ గురించి కాకుండా మంత్రివర్గ విస్తరణపై మాత్రమే చర్చించానని, దానినే తప్పుగా అర్థం చేసుకున్నారన్నారు.

**పావులు కదుపుతున్న డీకే**

సిద్ధరామయ్య తీరుపై అసహనంతో ఉన్న ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తన మద్దతుదారులతో పావులు కదుపుతున్నారు. బిహార్ ఎన్నికల తర్వాత దిల్లీకి వెళ్లినా రాహుల్ గాంధీ చర్చకు అవకాశం ఇవ్వకపోవటంతో ఆయన మద్దతుదారుల్లో అలజడి మొదలైంది. పార్టీ కోసం ఎంతో శ్రమించిన డీకే.. ముఖ్యమంత్రి పదవికి అర్హుడని మంత్రుల్లో కొందరు ఇటీవల వ్యాఖ్యానించారు. డాక్టర్ రంగనాథ్, బాలకృష్ణ, ఇక్బాల్ హుస్సేన్, గుబ్బి శ్రీనివాస్ తదితర ఎమ్మెల్యేలు డీకేకు మద్దతుగా గురువారం దిల్లీకి వెళ్లారు. శుక్రవారం మరో పది మంది ఎమ్మెల్యేల బృందం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను కలవనుంది. పీసీసీ అధ్యక్షుడిగా ఇంకెన్నో రోజులు కొనసాగలేనని ప్రకటించిన డీకే శివకుమార్ భవిష్యత్తు వ్యూహాలపై సంకేతాలిచ్చారు. సీనియర్ మంత్రులు రామలింగారెడ్డి, చలువరాయస్వామి తదితరులతో గురువారం సమావేశమై చర్చించారు. మరోవైపు శివకుమార్ సోదరుడు, మాజీ ఎంపీ డీకే సురేశ్ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటారన్న విశ్వాసం ఉందని వ్యాఖ్యానించారు. దీంతో అధికార పంపిణీ ఒప్పందం జరిగిందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

**అయోమయంలో అధిష్ఠానం**

బిహార్ ఎన్నికల్లో ఓటమితో నిరాశలో ఉన్న కాంగ్రెస్ అధిష్ఠానం ఇప్పటికిప్పుడే కర్ణాటక రాజకీయాల్లో మార్పులకు సిద్ధంగా

లేదని తెలుస్తోంది. దక్షిణాదిలో కీలకమైన కర్ణాటకలో నాయకత్వాన్ని మారిస్తే వ్యతిరేకత వచ్చి 2028 ఎన్నికల్లో ఆ ప్రభావం కనిపిస్తుందని అంచనా వేస్తోంది. సిద్ధరామయ్యను తప్పిస్తే ఆయనకు బలంగా ఉన్న శాసనసభ్యులు అసమ్మతి ప్రకటించే ప్రమాదం లేకపోలేదు. మరోవైపు తమకు ఇప్పటికిప్పుడే అధికారం వద్దు కానీ.. ఆ సమయం ఎప్పుడో స్పష్టత ఇవ్వాలని డీకే మద్దతుదారులు చేస్తున్న ఒత్తిడితో అధిష్ఠానం ఎటూ తేల్చుకోలేకపోతోంది.

# రాష్ట్రపతి,గవర్నర్లకు కోర్టులు గడువు విధించలేవు

-మొదటిపేజీ తరువాయి

బిల్లుల ఆమోదం' అంశంలో సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఈ కీలక తీర్పు వెలువరించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఏకాభిప్రాయంతో ఈ తీర్పునిచ్చింది. అయితే తమ వద్దకు వచ్చిన బిల్లులను గవర్నర్లు అకారణంగా, నిరవధికంగా నిలిపివేయడం తగదని, సహేతుక సమయంలోగా నిర్ణయం తీసుకోవాలని సూచించింది. నిరంకుశంగా బిల్లులను నిలిపివేసే పరిస్థితుల్లోనే కోర్టులు తమకున్న పరిమిత న్యాయ సమీక్ష అధికారాలను ఉపయోగించాల్సి వస్తుందని అభిప్రాయపడింది.అధికరణం 143 కింద రాష్ట్రపతి ముర్ము సంధించిన 14 ప్రశ్నలకు జవాబిచ్చింది. రాజ్యాంగ ధర్మాసనంలో జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ ఎ.ఎస్.చందూర్కర్ సభ్యులుగా ఉన్నారు.

**రాష్ట్రపతి లేఖకు కారణమైన తీర్పు ఇదీ...**

తమిళనాడు గవర్నర్ బిల్లులను నిరవధికంగా నిలిపివేయడాన్ని సవాల్‌చేస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ జె.బి.పార్దీవాలా,

జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం ఏప్రిల్ 8న నిర్ణయం వెలువరించింది. ఆ తీర్పు రాష్ట్రపతి, గవర్నర్ అధికారాల్లో జోక్యం చేసుకున్నట్లుగా ఉండటంతో మే 13న ప్రథమ పౌరురాలు ముర్ము 14 ప్రశ్నలతో సీజేఐకి లేఖ రాశారు.

**కోర్టు జోక్యం ఎంత వరకు?**

గవర్నర్ల విధులు, నిర్ణయాలలో కోర్టులు సాధారణంగా జోక్యం చేసుకోలేవని రాజ్యాంగ ధర్మాసనం చెప్పింది. కానీ, కారణం లేకుండా బిల్లులను దీర్ఘకాలం పెండింగ్‌లో ఉంచితే అది న్యాయపరమైన సమీక్ష పరిధిలోకి వస్తుందని పేర్కొంది. రాష్ట్రపతికి కూడా ఇదే నిబంధన వర్తిస్తుంది. గవర్నర్ బిల్లును పంపిన ప్రతిసారీ రాష్ట్రపతి.. సుప్రీంకోర్టును సంప్రదించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. అధికరణం 143 కింద రాష్ట్రపతి అవసరమని భావించినప్పుడు అభిప్రాయం కోరవచ్చని తెలిపింది.

# దేశ వ్యాప్తంగా సన్నబియ్యం ఇవ్వండి

దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణలో రేషన్ షాపుల ద్వారా వినియోగదారులకు సన్నబియ్యం సరఫరా చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణ మాదిరిగా దేశవ్యాప్తంగా పేదలకు సన్నబియ్యం పంపిణీ చేయాలని కేంద్ర ప్రభుత్వానికి ఆయన సూచించారు. గురువారం (నవంబర్ 20) కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ, పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి హైదరాబాద్ వచ్చారు. ఆయనతో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ప్రజలకు సన్నబియ్యం పంపిణీ అంశంపై ప్రహ్లాద్ జోషికి వివరించారు సీఎం రేవంత్. ప్రజలు తినే బియ్యం సరఫరా చేసినప్పుడే ఆ సంక్షేమ పథకం ఉద్దేశం నెరవేరుతుందని అన్నారు. తెలంగాణలో అమలు చేస్తున్నట్టుగా దేశ వ్యాప్తంగా వినియోగదారులకు సన్నబియ్యం పంపిణీ చేసే అంశాన్ని కేంద్రం పరిశీలించాలని సీఎం రేవంత్ సూచించారు. ఈ విషయంలో అవసరమైతే సమగ్రంగా అధ్యయనం చేసి తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు.సీఎం రేవంత్ సూచనపై కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి మాట్లాడుతూ.. పూర్తి స్థాయి అధ్యయనం జరిపిన తరువాత దేశ వ్యాప్తంగా సన్నబియ్యం పంపిణీ అంశంపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అన్ని మతాలపై నమ్మకం ఉందిగానీ.. బౌద్ధాన్ని అనుసరిస్తున్నా

-మొదటిపేజీ తరువాయి

లౌకికవ్యక్తిని. హిందు, బౌద్ధం, సిక్కు, ఇస్లాంలాంటి అన్ని మతాలపైనా నమ్మకం ఉంది. ఈరోజు నేను ఇక్కడనున్నానంటే ఈ వ్యవస్థ చలవే. అందుకే భారతీయ న్యాయవ్యవస్థకు హృదయపూర్వక కృతజ్ఞతలు చెబుతున్నా. మహారాష్ట్రలోని అమరావతిలో మురికివాడల్లోని మున్సిపల్ పాఠశాలలో విద్యాభ్యాసం ప్రారంభించిన నాలాంటి వ్యక్తి ఇంతటి ఉన్నతస్థానానికి రావడానికి ప్రధానకారణం అంబేద్కర్, భారత రాజ్యాంగమని నేను నిరంతరం చెబుతూ వస్తున్నా. అంబేద్కర్ రాజ్యాంగం రాయకపోయి ఉంటే మున్సిపల్ స్కూల్‌లో చదువుకున్న నాలాంటి విద్యార్థి ఇంతస్థాయికి రావడం గురించి కనీసం కలలోకూడా ఊహించలేం. నాలుగు దశాబ్దాల వృత్తిజీవితంలో భారతీయ న్యాయవ్యవస్థ నాకు ఎంతో ఇచ్చింది. సుప్రీం కోర్టు సీజేఐ కేంద్రీకృత కోర్టులాకాకుండా న్యాయమూర్తులందరి కోర్టులా ఉండాలని నేను ఎప్పుడూ భావించేవాడిని.అందుకే నేను ఏ నిర్ణయాలు తీసుకున్నా న్యాయమూర్తులందరితో కలిసే తీసుకున్నా. సుప్రీంకోర్టు తీర్పు వెలువడినప్పుడు ప్రజలు కేవలం న్యాయమూర్తులను మాత్రమే చూస్తారు. అయితే దానివెనుక న్యాయమూర్తులే కాకుండా, న్యాయవాదులు, రిజిస్ట్రీ, సిబ్బంది భాగస్వామ్యం ఉంటుందన్నది గుర్తించాలి. నా 40 ఏళ్ల వృత్తిజీవితంలో నిరంతరం రూల్ ఆఫ్ లాను నిలబెడుతూ వచ్చాను. నా తీర్పుల్లో రాజ్యాంగసూత్రాలకు ప్రాధాన్యం ఇచ్చాను. నేను పూర్తి సంతృప్తి, ఆనందంతో ఈ బాధ్యతలను తదుపరి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌కు అందిస్తున్నాను" అని సీజేఐ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తదుపరి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, అటార్నీ జనరల్ వెంకటరమణి, స్కోరా అధ్యక్షుడు విపిన్ నాయర్ తదితరులు పాల్గొని సీజేఐని సన్మానించారు.

## 3 దశల్లో పంచాయతీ ఎన్నికలు

- మొదటి పేజి తరువాయి

రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రతిపాదనలపై శుక్రవారం ప్రభుత్వం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి, షెడ్యూలు, ఎన్నికల తేదీలపై నిర్ణయం తీసుకోనుంది.

**రిజర్వేషన్లు ఖరారు చేయాలని కలెక్టర్లకు ఆదేశాలు**

పంచాయతీ ఎన్నికల సన్నద్ధతపై గురువారం రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని జిల్లాల కలెక్టర్లు, పంచాయతీ అధికారులు, జడ్పీ సీఈవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. వచ్చే నెల మూడో వారంలోపు ఎన్నికలుండే అవకాశమున్న నేపథ్యంలో డెడికేటెడ్ కమిషన్ నివేదిక ఆధారంగా ఈ నెల 22, 23 తేదీల్లో అన్ని జిల్లాల్లో రిజర్వేషన్లు ఖరారు చేయాలని ఆదేశించింది. మూడు దశల్లో ఎన్నికలు నిర్వహిస్తామని, తేదీలకు అనుగుణంగా ఆయా జిల్లాల్లో ఏర్పాట్లు చేసుకోవాలని సూచించింది. ఓటర్ల జాబితా ముద్రణ, పోలింగు కేంద్రాలు, బ్యాలెట్ బాక్స్‌లు, ఇతర సామగ్రిని సిద్ధం చేసుకోవాలంది. ఎన్నికల సిబ్బందిని సిద్ధం చేయాలని, సెలవులనూ రద్దు చేయాలని సూచించింది.

**50% రిజర్వేషన్లపై ఆర్డినెన్స్!**

పంచాయతీ ఎన్నికల్లో 50% రిజర్వేషన్ల అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయనుంది. ఈ నెల 17న జరిగిన మంత్రిమండలి సమావేశంలో 50% రిజర్వేషన్లతోనే ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. గతంలో రిజర్వేషన్లపై పరిమితిని ఎత్తివేస్తూ శాసనసభ, మండలిలో చట్ట సవరణ చేశారు. దానిపై ఆర్డినెన్స్ ఇవ్వడానికి గవర్నర్‌కు ప్రతిపాదనలు పంపగా ఆమోదం లభించలేదు. ఇప్పుడు పాతపద్ధతిలోనే ఎన్నికలకు వెళ్లేందుకు వీలుగా చట్ట సవరణ చేయాల్సి ఉంటుందని, దీనికోసం ఆర్డినెన్స్ జారీ చేయాలని అప్పుడే అధికారులు వివరించారు. దాంతో ఆర్డినెన్స్ ఇవ్వాలని మంత్రిమండలి నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు డెడికేటెడ్ కమిషన్ నివేదిక ఆధారంగా అధికారులు ప్రతిపాదనలు సిద్ధంచేశారు. అది గవర్నర్ ఆమోదానికి వెళ్లింది. అక్కడ ఆమోదం పొందిన వెంటనే రిజర్వేషన్లపై అధికారంగా ప్రకటన జారీ చేస్తారు.

## ఈ-కార్ రేసింగ్.. కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతి

హైదరాబాద్: ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏసీబీ విచారించేందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతించారు. ఈ కేసులో ఇప్పటికే పలుమార్లు కేటీఆర్ ఏసీబీ విచారణకు హాజరయ్యారు. ఫార్ములా ఈ-కార్ రేసింగ్‌లో రూ.54.88 కోట్ల నిధుల దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలున్నాయి.

ఈక్రమంలో కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతి కోరుతూ గతంలో ఏసీబీ లేఖ రాసింది. ఆయన పాత్రపై సాక్ష్యాలు ఉన్నాయంటూ అందులో పేర్కొంది. ఈక్రమంలో తాజాగా ఏసీబీ అధికారులకు అనుమతి ఇస్తూ గవర్నర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసులో త్వరలోనే ఏసీబీ ఛార్జ్‌షీట్ దాఖలు చేయనుంది.

## గనుల వేలంతో పెట్టుబడిదారుల్లో నమ్మకం

- మొదటి పేజి తరువాయి

ఇప్పటివరకు 134 క్రిటికల్ మినరల్ బ్లాక్‌లను వేలం వేసినట్లు కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఖనిజాల వెలికితీతలో గత పదేళ్లలో 160% వృద్ధి నమోదైందన్నారు. 1947లో దేశీయ ఖనిజ పరిశ్రమ రూ.58 కోట్ల విలువతో ఉండేదని, ఇప్పుడు ఏకంగా రూ.1.2 లక్షల కోట్లకు ఎదిగిందని చెప్పారు. లిథియం, కోబాల్ట్, నికెల్, రేర్ ఎర్త్స్, గ్రాఫైట్, కాపర్ వంటి ఖనిజాలకు ప్రపంచవ్యాప్తంగా భారీ డిమాండ్ ఏర్పడిందని, దీన్ని సవాల్‌గా తీసుకొని అవకాశంగా మలుచుకోవాలని పిలుపునిచ్చారు.

## ముగిసిన జగన్ విచారణ

**హైదరాబాద్, నవంబర్ 20:** మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాంపల్లి సీబీఐ కోర్టు లో హాజరీ ఇచ్చారు. దాదాపు ఆరు సంవత్సరాల తరువాత వ్యక్తిగతంగా జగన్ విచారణకు హాజరయ్యారు. కేవలం ఐదు నిమిషాలు మాత్రమే జగన్ కోర్టు హాల్ లో కూర్చున్నారు. న్యాయ మూర్తి ముందు హాజరయ్యారు. ఈ సందర్భంగా మీరేమైనా చెప్పదల్చుకున్నారా అని జగన్ ను సీబీఐ కోర్టు న్యాయ మూర్తి అడిగారు. అందుకు జగన్ తరఫు న్యాయవాది నో అని జవాబు చెప్పారు. ఆపై జగన్ వ్యక్తిగత హాజరును న్యాయ స్థానం రికార్డు చేసింది. అటెండెన్స్ పూర్తి అయిన తరువాత కోర్టు నుండి జగన్ బయటకు వెళ్లిపోయారు. కాగా విదేశీ పర్యటన అనుమతి పిటిషన్ లో భాగంగా కోర్టు ఆదేశాలతో జగన్ ఈ రోజు కోర్టుకు హాజరయ్యారు. పిటిషన్ ను న్యాయ స్థానం క్లోజ్ చేసింది. కేవలం 3 నిమిషాలు మాత్రమే విచారణ జరిగింది. జగన్ అప్పియరెన్స్‌ను కోర్టు రికార్డ్ చేసింది. రెగ్యులర్ కేసులతో సంబంధం లేకుండా జగన్ న్యాయ స్థానానికి వచ్చారు. సీబీఐ 11 కేసుల విచారణలో జగన్ తరఫు న్యాయవాది ఈరోజు మాత్రమే ఆబ్సెంట్ పిటిషన్ ను దాఖలు చేశారు.

## 100 ఉద్యోగాలకు జాబ్ మేళా...

● సద్వినియోగ పరచుకోండి ఉపాధి కల్పనాధికారి కొండపల్లి శ్రీరామ్...



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),నవంబర్ 20,** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లోని నిరుద్యోగ యువతీ యువకులకు మారుతి ఆగ్రోటెక్ అండ్ ఎగ్జిక్యూటివ్స్ వారి సంస్థ నందు పనిచేయుటకు, మొత్తం 100 ఖాళీలకు గాను ఉద్యోగాలు కలిపించేందుకు, ఉపాధి కల్పనా శాఖ ఆద్వర్యంలో నవంబర్ 21 అనగ శుక్రవారం నాడు జాబ్ మేళ, గవర్నమెంట్ డిగ్రీ కళాశాల పాల్వంచ, నందు నిర్వహించ బడుతుంది. కావున ఈ సదావకాశాన్ని 22 నుండి 38 సంవత్సరములగల నిరుద్యోగ 10త్ /ఇంటర్ /ఎనీ డిగ్రీ కలిగిన యువత యువకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధికల్పనశాఖాధికారి కొండపల్లి శ్రీరామ్ తెలియచేయుచున్నారు. పదవ తరగతి ఇంటర్మీడియట్ చదివిన వారికి ఏదైనా డిగ్రీ చదివిన వారికి 20 వేల జీతంతో ఉద్యోగ అవకాశాలు కల్పించ పడతాయి కావున అభ్యర్థులు ఉదయం 10.00 గంటల నుంచే ఇంటర్వ్యూ కొరకు సర్టిఫికేట్స్ జిరాక్స్ లతో వచ్చి తమ పేరు నమెదు చేసుకోగలరు. సంప్రదించ వలసిన నెంబర్ శ్రీనివాస రావు , హెచ్ ఆర్ : 9640663929. నెంబర్లు సంప్రదించాలని జిల్లా ఉపాధిఅధికారి కొండపల్లి శ్రీరామ్ ̆భద్రాద్రికొత్తగూడెం వారు పత్రిక ప్రకటన ద్వారా తెలియజేసినారు.

## శాస్త్ర సాంకేతిక రంగాల పురోగమనముతోనే భారత్ ప్రపంచ దేశాల్లో అగ్రగామిగా ఉంటుంది.

## పాపిరెడ్డి విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి






**సి కె న్యూస్ నవంబర్ 20 గురువారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ప్రతినిధి కమలాకర్:** ప్రపంచ బాలల దినోత్సవం పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ మడికొండ సౌజన్యంతో ధర్మసాగర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు .పాఠశాల ఇన్చార్జి ధర్మ ప్రకాష్ అధ్యక్షతన జరిగిన ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఈ పాఠశాల పూర్వ విద్యార్థి విశ్రాంత ఆర్మీ సైనికుడు , ప్రభుత్వ దేవాదాయ శాఖలో అధికారిగా పనిచేసి ప్రస్తుతం విశ్రాంతి ఉద్యోగుల సంఘానికి కార్యదర్శిగా సేవలందిస్తున్న పాపిరెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణ జీవితంతోనే ప్రతి ఒక్కరి ప్రగతి ఆధారపడుతుంది , ఇష్టంతో కష్టపడి చదివితే అనుకున్న స్థాయికి కచ్చితంగా ఎదగగలుగుతారు అన్నారు. విశ్రాంత అటవీ అధికారి ,లైన్స్ క్లబ్ ఆఫ్ మడికొండ అధ్యక్షులు మనోహర స్వామి మాట్లాడుతూ అమెరికా సందర్శన వారి ప్రత్యక్ష అనుభవాలను జోడిస్తూ భారత విద్యారంగము, విద్యార్థులు అమెరికా విద్యారంగం వ్యత్యాసాలను తెలుపుతూ విద్యార్థులు ప్రతి అవకాశాలు వినియోగించుకొని ఆకాశమే హద్దుగా ఎదగాలని అన్నారు. పాఠశాల హిందీ ఉపాధ్యాయురాలు పద్మజ క్విజ్ నిర్వహించారు. అలాగే వ్యాసరచనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు రేణుక, మధుప్రియ, అజయ్, లాస్య ,ప్రశాంత్ ,సి%శీ%ద్ధ ప్రియాంకలకు లైన్స్ క్లబ్ ఆఫ్ మడికొండ సభ్యులచే బహుమతులు అందజేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు శ్రీధర్, ఉపాధ్యాయులు కవిత ,సురేష్ రాజమ్మ ,కిరణ్ మై, రామకృష్ణ పాల్గొన్నారు.

# సీఎం పర్యటన నేపథ్యంలో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ లో ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),నవంబర్ 20,** ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రానున్న నేపథ్యంలో, ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ గురువారం ప్రత్యక్షంగా పరిశీలించారు. యూనివర్సిటీ క్యాంపస్ మొత్తం పర్యటించిన కలెక్టర్ అకాడమిక్ బ్లాక్ రిపేర్ వర్క్స్, ఆడిటోరియం మరమ్మత్తులు, బాలుర కామన్ మెస్ మరియు బాలికల హాస్టల్ పనుల పురోగతిని పరిశీలించి సంబంధిత శాఖలతో వివరంగా చర్చించారు. ఆడిటోరియంలో మౌలిక వసతులు, సీటింగ్ ఏర్పాట్లు, స్టేజ్ సెటప్, లైటింగ్, ఎలక్ట్రికల్ పనులు వంటి అంశాలన్నీ నాణ్యతతో పూర్తవ్వాలని ఆయన సూచించారు.

యూనివర్సిటీ పాత మరియు కొత్త భవనాల సుందరీ కరణ, పార్కింగ్ ప్రాంతాల అభివృద్ధి, క్యాంపస్ అంతటా పరిశుభ్రత, లైటింగ్ పనులను కలెక్టర్ పరిశీలించి పలు సూచనలు%–%సలహాలు ఇచ్చారు. ముఖ్యమంత్రి ప్రారంభించే శిలాఫలకం ఏర్పాట్లను కూడా పరిశీలించి, దాని వద్ద ఏర్పాట్లు ఆకర్షణీయం గా, సముచిత ప్రమాణాలతో ఉండాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. విద్యార్థుల వసతి గృహాల్లో ఫర్నిచర్ అమరిక, నీటి సదుపాయాలు, శౌచాలయాల మరమ్మత్తులు, వసతి ప్రాంతాల పరిశుభ్రత వంటి అంశాలను కూడా ఆయన సమీక్షించారు. క్యాంపస్ ఆవరణ మొత్తం పచ్చదనం ఉట్టిపడేలా మొక్కలు నాటడంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని కళాశాల ప్రిన్సిపల్ డా. జగన్మోహన్ రాజును కలెక్టర్ ప్రత్యేకంగా ఆదేశించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, యూనివర్సిటీ ప్రారంభోత్సవం జిల్లాకు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన కార్యక్రమమని, అన్ని ఏర్పాట్లు అత్యున్నత నాణ్యతతో పూర్తవ్వాలని సూచించారు. విద్యా రంగంలో జిల్లాకు ఇది ఒక ప్రధాన మైలురాయి అవుతుందని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం అన్ని శాఖల సమిష్టి బాధ్యత అని స్పష్టం చేశారు. అధికారులు అత్యంత వేగం మరియు శ్రద్ధతో పనులు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ సుజాత, పంచాయతీరాజ్ ఈ ఈ శ్రీనివాస్, ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ అధ్యాపకులు, సిబ్బంది మరియు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రెస్ క్లబ్ అంతర్జాతీయ జర్నలిస్ట్ డే వేడుకలు...





- భద్రాద్రి జిల్లా ప్రెస్ క్లబ్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షులు రత్న కుమార్ ఆధ్వర్యంలో వేడుకలు...
- జర్నలిస్టుల వృత్తి కత్తిమీద సాము లాంటిది : సెకండ్ క్లాస్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ మెండు రాజమల్లు.
- జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు కృషి చేయాలి : మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతా లక్ష్మి.
- వాట్సప్ వార్తలకు ఎవరు స్పందించవద్దు. జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రత్న కుమార్...

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),నవంబర్ 20,** కొత్తగూడెం పిఆర్ ఫంక్షన్ హాల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రెస్ క్లబ్ వెల్ఫర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నవంబర్ 19న అంతర్జాతీయ జర్నలిస్ట్ దినోత్సవాన్ని పురస్కరించుకొని భద్రాద్రి జిల్లా ప్రెస్ క్లబ్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షులు రత్నకుమార్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సెకండ్ క్లాస్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ మెండు రాజమల్లు కొత్తగూడెం మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాజీ మున్సిపల్ చైర్పర్సన్ కాపు సీతామాలక్ష్మి మాట్లాడుతూ అంతర్జాతీయ జర్నలిస్ట్ డే వేడుకలు జరుపుకోవటం ప్రతి ఒక విలేకరి బాధ్యత తమ విధులను నిర్వర్తిస్తూ ప్రాణాలను అర్పించిన జర్నలిస్టుల జ్ఞాపకాలకు గుర్తుగా ఈ రోజును జరుపుకుంటారు. జర్నలిజం అనేది కత్తి మీద సాములాంటిదని పేర్కొన్నారు. జిల్లా నలుమూలల నుంచి డిస్టిక్ రిపోర్టర్స్ ను ఒక్కటిగా చేసి క్లబ్ ఏర్పరచడం అనేది చాలా గొప్ప విషయం అని జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రత్న కుమారును, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతా లక్ష్మి అభినందించినారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం అధికారులు దృష్టికి తీసుకువెళ్లి వెంటనే పరిష్కార మార్గాన్ని చూపించే ఏకైక వ్యక్తి జర్నలిస్టు అని అన్నారు.అవసరమైన సమాచారాన్ని అందించే బాధ్యత వారిపై ఉంది. అందువల్ల వారి ప్రయత్నాలను గుర్తించడానికి ఒక రోజు ఉండటం చాలా ముఖ్యం అని తెలిపారు. ఈ సందర్భంగా

సెకండ్ క్లాస్ అదనపు మెజిస్ట్రేట్ రాజమల్లు మాట్లాడుతూ ఇంతమంది జిల్లా స్టాఫ్ రిపోర్టర్లను ఏర్పాటు చేసి ఒక తాటిపైకి తీసుకురావడం అభినందనీయమని ఫోర్ పిల్లర్ గా ఉన్న జర్నలిస్టులు ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో కృషి చేస్తున్న జర్నలిస్టులకు అభినందనలు తెలియజేసిన రాజమల్లు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రత్న కుమార్ ను అభినందించారు.

ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రెస్ క్లబ్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షులు రత్నకుమార్ మాట్లాడుతూ సంస్థ నుంచి ,ప్రభుత్వం నుంచి గాని పత్రిక రంగంలో పనిచేస్తున్న చాలామంది జర్నలిస్టులకు వేతనాలు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పూట గడవని పరిస్థితి ఉన్న ఎందరో నిజాయితీ పరులైన విలేకరులు ఉన్నారు. అనారోగ్య సమస్యలు వస్తే కనీసం హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ కూడా ప్రభుత్వం అమలు చేయడం లేదు. ప్రతి జర్నలిస్టుకు హెల్త్ పాలసీ ప్రభుత్వం అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రతి జర్నలిస్ట్ కూడా పత్రిక రంగంలో రాణించాలంటే నేటి మెలకువలు నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు. వాట్సాప్ లలో వచ్చిన వార్తలను ప్రచురించకుండా సొంత కంటెంట్తో వార్తలు తయారు చేసి విలువలను పెంచాల్సిందిగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్లను కోరినారు. అందరం ఏకతాటి పై ఉంటూ ఒకరికి ఒకరు తోడుగా ఉండాల్సిన అవసరం ఉన్నదని ఎందరో మహాను భావులు ప్రెస్ క్లబ్బును విచ్చినం చేయాలని చూస్తున్నారని ఎవరిని అడిగి ప్రెస్ క్లబ్ ను పెట్టుకోవాల్సిన అవసరం లేదని నీతి నిజాయితీతో ఉంటూ ప్రతి జర్నలిస్టుకు అండగా ఉంటూ ముందుకు వెళ్లడమే నా కర్తవ్యం అని ఎవరెన్ని కుతంత్రాలు పన్నిన ఏమి చేసేది లేదని ఏమి చేయలేరని కూడా ఈ సందర్భంగా తెలియజేస్తున్నాం. ఈ కార్యక్రమం భద్రాద్రి జిల్లా ప్రెస్ క్లబ్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షులు రత్న కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి.

ఈ కార్యక్రమంలో 42 మంది జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు ను శాలువాతో సన్మానించి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రెస్ క్లబ్ మెమొండోను అందజేయడం జరిగింది అనంతరం అందరూ కలిసి చికెన్ బిర్యానీ తో విందు చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ న్యూస్ ఛానల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ డొంకన చంద్రశేఖర్ కు డిసెంబర్లో హైదరాబాదులో అవార్డు అందుకోబోతున్న సందర్భంగా ముందుగా చంద్రశేఖర్ ను ఘనంగా సన్మానించిన జిల్లా ప్రెస్ క్లబ్. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రెస్ క్లబ్ వెల్ఫేర్ ట్రస్ట్ కార్యదర్శి సతీష్ జిల్లా ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులు ముత్యాల రాజేష్ జిల్లా ప్రెస్ క్లబ్ ట్రెజరర్ శెట్టి గోపి జమాతే ఇస్లామి హింద్ అధ్యక్షులు షేక్ అబ్దుల్ బాసిత్ టాటా ఏఐఏ ఇన్సూరెన్స్ కొత్తగూడెం బ్రాంచ్ మేనేజర్ జక్కుల సతీష్ ,కమల రాణి కొచ్చెర్ల. టాటా ఏ ఐ ఏ సీనియర్ బిజినెస్ అసోసియేట్.(లీడర్) కొత్తగూడెం బ్రాంచ్. అశ్వరావుపేట దమ్మపేట మణుగూరు భద్రాచలం చర్ల సుజాతనగర్ బూర్గంపాడు అన్నపురెడ్డిపల్లి చంద్రుగొండ కొత్తగూడెం నుండి జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు పలు పత్రికలలో పనిచేస్తున్న రిపోర్టర్లు మహిళా జర్నలిస్టులు పాల్గొన్నారు.




## వాలీబాల్ అండర్ 18 క్రీడాకారుల ఎంపికలు, చేగుంట



**నవంబర్ 20 (సీ కే న్యూస్) చేగుంట:** తెలంగాణ 8వ అంతర్ రాష్ట్ర జిల్లాల వాలీబాల్ పోటీలకు ఉమ్మడి మెదక్ జిల్లా వాలీబాల్ అండర్ 18 సం" బాలుర బాలికల ఎంపికలు శుక్రవారం 21 నవంబర్ 2025 నాడు చేగుంట ఎంపీడీవో కార్యాలయ క్రీడా మైదానంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించనున్నాము ఇట్టి క్రీడాలకు ఆసక్తి కలిగిన క్రీడాకారులు 01-01-2008 తర్వాత జన్మించి ఉన్న క్రీడాకారులు అర్హులు తమ జన్మ ధృవపత్రాలు ఒరిజినల్స్ ఒక సెట్టు జిరాక్స్ తో హాజరు కావలసిందిగా ఉమ్మడి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు అయిత పరంజ్యోతి, ఆర్ వెంకటేశ్వర్లు,
పాల సాయిరాం, ప్రధాన కార్యదర్శులు కే రవీందర్, ఏ కృష్ణ, రవీందర్ రెడ్డిలు, సూచించారు

## యువకుడు అదృశ్యం



**నవంబర్ 20 (సీ కే న్యూస్) చేగుంట:** ఇంట్లో నుండి వెళ్లిన వ్యక్తి తిరిగి ఇంటికి రాకపోవడంతో, విరాల ప్రకారం, చేగుంట మండలం వడియారం గ్రామానికి చెందిన నల్ల పరిమేష్, వయసు 25 సంవత్సరములు, తండ్రి కిషన్, పరమేష్, వృత్తి కూలి పని, తేదీ 18, 11, 2025 నాడు మధ్య రాత్రి ఇంట్లో నుండి ఎవరికి చెప్పకుండా ఎటో వెళ్లిపోయినాడు అతని ముఖం కోలం ముఖం కలిగి ఉంటాడు తెలుపు రంగు కలడు, ఎత్తు సుమారు 5 ఫీట్లు కలడు ఇంట్లో నుండి బయలుదేరినప్పుడు మెరున్ రంగు షర్టు నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు, చుట్టుపక్కల వెతికిన మరియు బంధువుల వద్ద వెతికిన ఆచూకీ తెలియలేదు, ఇట్టి విషయంలో అతని తల్లి నల్ల యాదమ్మ భర్త నల్ల కిషన ఫిర్యాదు మేరకు, చేగుంట ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు,

CK NEWS చంద్ర కాంత్ తెలుగు దినపత్రిక
శుక్రవారం | తెలంగాణ
21 నవంబర్ 2025
cknews7484@gmail.com

Follow: @cknews

# చేగుంట మెదక్ రోడ్డు, రైల్వే ఆర్వో బ్రిడ్జి పనులు ప్రారంభానికి పరిశీలన,

**ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి**

**నవంబర్ 20 (సీ కే న్యూస్) చేగుంట:**చేగుంట పట్టణ కేంద్రంలో చేగుంట నుండి మెదక్ వెళ్ళే రోడ్
228 రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద ఆర్వో బ్రిడ్జి పనులను ప్రారంభించేందుకు అధికారులు గురువారం సంయుక్త పరిశీలన చేపట్టారు. ఆర్వో బ్రిడ్జి నిర్మాణానికి అడ్డుగా ఉన్న కరెంట్ లైన్లు, వాటర్ పైపులు, కమ్యూనికేషన్ కేబుళ్లను పక్కకి తరలించే పనులను పరిశీలించి సంబంధిత శాఖలకు సూచనలు ఇచ్చారు. అవసరమైన చోట్ల చెట్ల తొలగింపు ప్రక్రియను కూడా అధికారులు సమీక్షించారు.ఆర్వో బ్రిడ్జి పనుల వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీస్ శాఖతో కలిసి ప్రత్యామ్నాయ రహదారి మార్గాలను ఏర్పాటు చేయడంతో పాటు వాహనదారులకు స్పష్టమైన మార్గదర్శక సూచనలు అందించేందుకు, సైన్‌బోర్డులు ఏర్పాటు చేయనున్నారు.
228 లెవల్ క్రాసింగ్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయితే చేగుంట%–% మెదక్ మధ్య వాహనాల రాకపోకలకు భారీగా సౌలభ్యం కలుగుతుందని అధికారులు తెలిపారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా పనులను వేగంగా పూర్తి చేసే విధంగా ప్రణాళికలు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే



అధికారులు జగదీష్ ,సుధాకర్, చేగుంట ఎస్సై చైతన్య రెడ్డి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కిరణ్‌కుమార్,మిషన్ భగీరథ ఏఈ, ఆర్ %ఽ% బి డీఈ నాగరాజు,మాజీ బిజెపి మండల అధ్యక్షులు భూపాల్, బిజేవైయం అధ్యక్షుడు శేఖర్ గౌడ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తండ్రి జ్ఞాపకార్థం యాచకులకు పేదవారికి రగ్గులు అందజేత.

**టీ టైప్స్ అధినేత యడారి శివ రామకృష్ణ.**




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ బూర్గంపహాడ్ ప్రతినిధి, ( సాయి కౌశిక్),నవంబర్ 20,**బూర్గంపహాడ్ మండలం సారపాక టీ టైప్స్ ( పెట్రోల్ బంక్ దగ్గర) అధినేత మరియు విలేకరి ఆయన యడారి శివరామకృష్ణ తన తండ్రి గారైన కీర్తిశేషులు ఎడారి సీతారాములు జ్ఞాపకార్థంగా భద్రాచలం సారపాక మరియు బూర్గంపాడు గ్రామాలలో బస్టాండ్ నందు ఆలయాల వద్ద గల యాచకులు, పేదవారు ఎముకలు కొరికే చలితో ఇబ్బంది పడుతున్న దృశ్యాలను చూసి చలించిపోయి వారికి తన వంతు బాధ్యతగా సహాయం అందించాలని దృక్పథంతో తన సొంత ఖర్చులతో సుమారు 80 మందికి రగ్గులను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి యడారి శివరామకృష్ణ మాట్లాడుతూ యాచకులు, పేద వారు చలికాలం బయట బస్టాండ్ల వద్ద, ఆలయాల వద్ద ఎముకలు కొరికే చలిలో వణుకుతూ నిద్రిస్తున్న వారిని చూసి వారికి చలి తీవ్రత నుండి కొంత ఉపశమనం కలిగించడానికి నా వంతు సహాయంగా వారికి రగ్గులను అందించడం నాకు ఎంతో సంతోషంగా ఉందని ఆనందాన్ని వ్యక్తపరిచారు, ఇకపై ఇదేవిధంగా మా నాన్న జ్ఞాపకార్థం పై మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తానని, అదేవిధంగా మా నాన్నగారు స్వర్గస్తులైన రోజు డిసెంబర్ 13 వ తేదీన కావున ఆరోజున సారపాక గ్రామంలో టీ టైప్స్ (పెట్రోల్ బంక్ దగ్గర) టీ టైప్స్ వద్ద అన్నదాన కార్యక్రమాన్ని చేయాలని నిశ్చయించుకున్నారని ఆ కార్యక్రమాన్ని కూడా పెద్ద మనసుతో జయప్రదం చేయాలని కోరారు. ఈ రగ్గుల పంపిణీ కార్యక్రమాన్ని ముందుకు నడిపించిన మా మిత్రులు గార్లపాటి సుధాకర్, బనాత రాజా, మరియు గంటా సాయి వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో యడారి సాయి విష్ణు, యడారి సాయి మనోజ్, యడారి అచ్చారావు, నరసమ్మ, యడారి దుర్గ, నందిని, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ భీమ లింగేశ్వర స్వామి ఆలయంలో లక్షదీపాల అలంకరణ.

- ప్రత్యేక పూజలు నిర్వహించిన బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు వరికుప్పల మల్లేశం దంపతులు.




**సీకే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి నవంబర్ 20.**
యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలో ఉన్న సంఘము గ్రామంలో పుణ్యక్షేత్రం మైన శ్రీ భీమ లింగేశ్వర స్వామి ఆలయంలో లక్షదీపాల అలంకరణ కార్యక్రమంలో పాల్గొని శివలింగానికి ప్రత్యేక పూజలు పాలాభిషేకం నిర్వహించిన బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు వరికుప్పల మల్లేశం దంపతులు, కుటుంబ సభ్యులు.

# రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు 72 మంది ఎంపిక

**కోచ్ రవికుమార్ గణేష్, వెల్లడి**

29,11,2025 నాడు చేగుంట మండలంలోని మోడల్ స్కూల్ ఆవరణలో జరిగిన ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి అండర్ 14 అండర్ 17 అండర్ 19 బాల బాలికల ఫెన్సింగ్ పోటీలకు ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి దాదాపు 300 మంది పైన పాల్గొన్నారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా వచ్చిన మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఈ పోటీలను ప్రారంభించారు. అండర్ 14 బాలికల ఫాయిల్ విభాగంలో నేహశ్రీ,నిహారిక,లాస్య,విఘ్నేశ్వరీ, ఈఫి విభాగంలో కీర్తన,స్పందన,ఆరాధ్య, హరిణి సాబేర్ విభాగం లో హర్షిత,వైష్ణవి,వర్ష, సెరా ఎంపికయ్యారు. ఈఫి బాలుర విభాగంలో హర్షవర్ధన్,మహేష్,అభిరామ్,బద్రీనాథ,ఫాయిల్ విభాగంలో కార్తీక్,శుశాంక్,రుషికేశ్, చంద్రం ఎంపికయ్యారు. సాబేర్ విభాగం లో చరణ్,శ్రీరామ్, కే సాత్విక్,సాత్విక్ అండర్ 17 బాలికల ఈఫీ విభాగంలో ప్రీతి,చందన, ప్రవలిక, తేజరాని ఫాయిల్ జేష్ఠ,వర్షిణి,మహిమ,వైష్ణవి సాబేర్ విభాగంలో సమీక్ష,లాస్య,మానస, యశిక ఎంపికవ్వగా బాలుర ఫాయిల్ విభాగంలో శ్రీపత్,నిరంజన్,రాకేష్,రాజేందర్ ఈఫీ విభాగంలో జగదీష్,హర్షవర్ధన్,మణికంఠ, విత్తు సాబేర్ విభాగంలో రామకృష్ణ,చైతన్య,శివచరణ్,ప్రణవ్ గౌడ్ ఎంపికయ్యారు.అండర్ 19 బాలికల ఈపి నందిని,మంజుల,రక్షిత,సునీత, ఫాయిల్ సంయుక్త,వైష్ణవి, భూలీ, అఖిల సాబేర్ బాలికల విభాగంలో



మహేశ్వరి,కీర్తన,శివలీల,జోషిత ఎంపికయ్యారు.బాలుర ఈపి విభాగంలో అక్షయ్,శివకుమార్,సహా, సంతోష్ కుమార్,ఫాయిల్ విభాగంలో మణిదీప్,చందు,బన్నీ,శ్రీనాథ్ ఎంపికయ్యారు. అండర్ 14 బాల,బాలికలకు ఈ నెల 21,22,23 తేదీలలో మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు జిల్లా పరిషత్ హై స్కూల్ లో టోర్నమెంట్ ఉంటుందని అండర్ 17 బాల,బాలికలకు ఈ నెల 23,24,25 తేదీలలో,అండర్ 19 బాల,బాలికలకు ఈ నెల 22,23,24 తేదీలలో నెల్లికుదురు పాఠశాలలోనే పోటీలు ఉంటాయని ఉమ్మడి మెదక్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీలు నాగరాజు,సౌందర్య,శ్రీనివాస్,గణపతి,సమ్మయ్య కోచ్ కరణం గణేష్ రవికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫెన్సింగ్ రెఫరీలు కరణం మల్లీశ్వరి కౌండిన్య అన్నం రవి స్వర్ణలత భవాని నిశాంత్ శ్రీశాంత్ అంజలి తదితరులు పాల్గొన్నారు.

# వలిగొండ మార్కెట్లో వడ్ల మ్యాచరు చూసే మిషన్లు లేక రైతుల ఇబ్బందులు.

**రైతు మునుకుంట్ల ఎల్లయ్య గౌడ్ ఆవేదన.**



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు నవంబర్ 20.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం కేంద్రంలో ఉన్న వ్యవసాయ మార్కెట్ లో ఉన్న రైతులు మీడియాతో మాట్లాడుతూ. ఒడ్లు ఎండిన మ్యాచరు చూసే మిషన్లు లేనందున చాలా ఇబ్బందులకు గురి అవుతున్నామని.
ఒడ్లు ఎండిన మ్యాచరు చూసే పరికరాలు లేక ఎండిన ఒడ్లు అలాగే ఉండే పరిస్థితి ఏర్పడుతుందని దయచేసి మార్కెట్ పాలకవర్గం తక్షణమే స్పందించి వడ్ల మ్యాచరు చూసే మిషన్లు వెంటనే ఏర్పాటు చేయాలని వడ్ల పైన కవర్లు కూడా సరిగా రైతులకు మార్కెట్ యాజమాన్యం ఇవ్వలేకపోతున్నారని వెంటనే మార్కెట్ అధికారులు చైర్మన్ గారు స్పందించాలని కోరినారు.

# సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభకు విరాళాల సేకరణ



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభకు చింతకాని మండల వ్యాప్తంగా మండల సమితి ఆధ్వర్యంలో విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఆయా గ్రామాల్లో విరాళాల సేకరణతో పాటు వాల్ రైటింగ్, గ్రామ శాఖల సమావేశాలను ఏర్పాటుచేసి ప్రచారాన్ని మామ్మురం చేస్తున్నారు. విరాళాల సేకరణ కార్యక్రమంలో భాగంగా గురువారం నాగిలిగొండ గ్రామంలో విరాళాలు సేకరణతో పాటు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్మల జితేందర్ రెడ్డి మాట్లాడుతూ పోరాటాల పురిటి గడ్డ ఖమ్మంలో నిర్వహిస్తున్న సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభకు అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్రబాబు, శాఖ కార్యదర్శి చాట్ల రమేష్, నాయకులు ఏపూరి నరసయ్య, షేక్ చిన్న జాన్, అరికోట్ల భాస్కర్, దమ్మాలపాటి శ్రీను, చాట్ల బాబు తదితరులు పాల్గొన్నారు.

# సర్వే నెంబరు 708,693,699 ,320 సర్వే నెంబర్లలో భూకబ్జా కు ఎలాంటి అవకాశం లేదు.

**అసత్యపు ఆరోపణలకు పాల్పడితే సహించేది లేదు.**

**భూమి కబ్జాకు గురి కాలేదని ఆధారాలున్నాయి.**

**చిట్టేడి జనార్దన్ రెడ్డి కుటుంబ సభ్యులు.**



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు నవంబరు 20.**యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పరిధిలోని అరూరు గ్రామంలో.
మాజీ సర్పంచ్ వలిగొండ మాజీ ఎంపీపీ చిట్టిడి జనార్దన్ రెడ్డి వారి కుటుంబ సభ్యులు సీఎన్ రెడ్డి పై వచ్చిన భూకబ్జా ఆరోపణలను ఖండిస్తూ వారి సొంత గ్రామంలో మీడియాతో మాట్లాడుతూ.
కావాలనే రాజకీయ కక్ష తోటి మా కుటుంబ సభ్యుల ఎదుగుదల భరించలేక కక్షకట్టుకొని మాపై నిరాదరమైన ఆరోపణలు చేస్తూ గ్రామంలోని సుక్క స్వామి కోడతల కరుణాకర్ బుర్ర నరసింహ తోటి ఇష్టానుసారంగా మాపై దుష్ప్రచారాలు మీడియా ద్వారా వాకిటి అనంతరెడ్డి మాట్లాడిపిస్తున్నారు.
మేము మా కుటుంబము ఎవరి భూమిని కబ్జా చేయలేదు ఎవరైతే మీడియా ద్వారా రైతులు మాట్లాడినారో వారు స్వయంగా వారి భూమికి సంబంధించిన పాస్బుక్కులు డాక్యుమెంట్లు తీసుకొని మండల అధికారులు సంప్రదిస్తే మేము స్వచ్ఛందంగా వారి భూమి కబ్జా చేసినట్టయితే పట్టాదారులకు అప్పచెప్పుతాము.
కానీ వారికి ఎలాంటి పాసుబుక్కులు లేక డాక్యుమెంట్స్ లేక ఎలాంటి ఆధారాలు లేక మాపై మీడియా ద్వారా భూమి కబ్జా చేసినామని అనడం సరైనది కాదు. భయభ్రాంతులకు గురి చేస్తున్నారని రైతుల ద్వారా మాట్లాడించడం వాకిటి అనంతరెడ్డి కి సరైనది కాదనీ.
జిల్లా అధికారులు ఏడి గారు సర్వే చేసిన సాక్షాదారాలు మా దగ్గర ఉన్నాయి.
మీడియా ద్వారా నేను ఒకటే చెబుతున్నాను ఇకనైనా అరూరు గ్రామపంచాయతీ దగ్గర కూర్చొని గ్రామ ప్రజల ముందు మండలాధికారుల ముందు చర్చిద్దాం రండి అని మీడియా ద్వారా మాట్లాడినారు.
కొంతమంది రైతులు ఆవుల బిక్షపతి, యశోద వెంకటేశం గొడుగు యశోద వెంకటేశం, కొల్లూరు నరసింహ, నిమ్మల రామచంద్రు, సొల్లు చెన్నమ్మ, బుర్ర సుశీల ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ మాకు ఎలాంటి అన్యాయం జరగలేదని మా భూమి మేము కబ్జాలోనే ఉన్నామని మాకు వీలుకాక సిఎన్ రెడ్డికి కౌలుకు ఇచ్చినామని మాకు సరైన పాసుబుక్ డాక్యుమెంట్స్ మా పేరునే ఉన్నాయని మాట్లాడినారు.
ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొని వాళ్ళ అభిప్రాయాలు కూడా మీడియా ద్వారా చెప్పినారు.

# వడియారం చెరువులో మొసళ్ల కలకలం భయంతో గ్రామప్రజలు

**నవంబర్ 20 (సీ కే న్యూస్) చేగుంట**: చేగుంట మండలం వడియారం గ్రామం లో ఉన్న పెద్దచెరువులో మొసళ్లు కనిపించడం వల్ల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. చెరువుల్లో నీటి మట్టం పెరిగినప్పుడు లేదా వరదల సమయంలో మొసళ్లు బయటపడి, జనసంచారంలోకి, లేదా చెరువులోకి రావడం జరిగిందని, ఇవి రావడం వల్ల ప్రజలు భయభ్రాంతులకు గురి అవుతున్నారు,
ప్రమాదకరమైనవి: మొసళ్లు బలీయమైన మాంసాహారులు, చాలా శక్తివంతమైనవి, దగ్గరకు వస్తే తీవ్రంగా గాయపరచగలవు అని
ప్రజల భయం పట్టుకుంది,మొసళ్లను చూసిన వెంటనే ప్రజలు భయంతో పరుగులు తీసి, ఇతరులను హెచ్చరిస్తున్నారు.
జాగ్రత్త చర్యలు: అధికారులు, అప్రమత్తత కోసం చెరువు గట్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసారు,

**సెక్షన్ ఆఫీసర్ కిరణ్ కుమార్ వివరణ కోరగా**

ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కిరణ్ కుమార్ ని చెరువు లో మొసలిలు గురించి అడగ, చెరువులో రెండు మొసలు ఉన్నాయని గుర్తించామని, వీటి పైన జిల్లా డీఎఫ్ఓ ఆఫీసర్ కి ఇన్ఫర్మేషన్ ఇచ్చామని, చెరువులో నీళ్లు ఎక్కువగా ఉండడం వల్ల వాటిని పట్టుకోవడం కొంచెం ఇబ్బందిగా ఉందని, వీటిని త్వరలోనే పట్టుకుంటామని తెలియజేశారు.




ఈ కార్యక్రమం లో గ్రామస్తులు సాయి కుమార్ గౌడ్, నాగరాజు, అనిల్, నవీన్ గౌడ్, రాజు, సమీర్, శివ, ప్రవీణ్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# యువతి ఫోన్ కోసం ఆత్మహత్య

**నవంబర్ 20 (సి కే న్యూస్) చేగుంట:**ఫోన్ కోసం యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మసాయిపేట పట్టణ కేంద్రంలో గురువారం నాడు చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మాసాయిపేట గ్రామానికి చెందిన దొంతి నాగ రాజు గౌడ్, కూతురు మహాలక్ష్మి వయస్సు (18) తన ఫోన్ తీసుకెళ్లి ఎక్కడో పోగొట్టుకున్నాడు. ఇంటికి వచ్చిన తర్వాత ఫోన్ విషయంలో మహాలక్ష్మి తండ్రితో కొత్త ఫోన్ కావాలని గొడవ పడింది. తండ్రి నాగరాజు గౌడ్ కొత్త ఫోన్ రేపు కొనిస్తానని చెప్పినప్పటికీ మహాలక్ష్మి తీవ్రంగా మనస్తాపం చెంది, ఇంటిలో ఫ్యాన్ కి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం తెలుసుకున్న చేగుంట ఎస్ ఐ చైతన్య కుమార్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించి మృతదేహాన్ని తూప్రాన్ ఏరియా హాస్పిటల్ కి తరలించారు. మహాలక్ష్మి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి



# అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గంటా





మధురవాడ, సికె న్యూస్ ప్రతినిధి జీవీఎంసీ 5 వ వార్డు పరిధిలో సుమారు12 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదించిన పలు అభివృద్ధి పనులకు భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు గురువారం శంకుస్థాపన చేశారు. 5 వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత ఆధ్వర్యంలో సాయిరాం కాలనీలో ఏర్పాటు చేసిన శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా సుమారు12 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. భూగర్భ డ్రైనేజీ ప్రాజెక్టులు, మంచినీటి పైపులైన్ల వర్కులు, కాలువలు, డ్రైన్లు నిర్మాణం

సిసి రోడ్ల నిర్మాణం మారికవలస గ్రామంలో బ్రిడ్జ్ పనులు, ఈ పనులన్నీ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించామని, వీటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పనులు నాణ్యతతో, వేగంగా జరిగేలా పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం కార్పొరేటర్ మొల్లి హేమలత మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు సహకారంతో వార్డులో మెరుగైన మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందని, అందులో భాగంగా ఈరోజు సుమారు 12 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని, ఇంకా వార్డు పరిధిలో త్రాగునీటి, రోడ్లు, కాలువలు సామాజిక భవనాల రూపకల్పనకు ప్రణాళికలు రూపొందించడం జరుగుతుందని, అంచెలంచెలుగా వార్డులో గల అన్ని సమస్యలకు పరిష్కారం చూపించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మొల్లిలక్ష్మణరావు, పిల్లా వెంకట్రావు, వాండ్రాశి అప్పలరాజు, మన్యాల సోంబాబు, బోయి వెంకటరమణ, 5 వ వార్డు అధ్యక్షులు నాగోతి సత్యనారాయణ, ఈగల రవికుమార్, నగరాల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ నాగోతి అనిత జనసేన, బిజెపి నాయకులు దేవర శివ, ఎండ అప్పారావు 5,6,7,8 వార్డుల అధ్యక్షులు కూటమి నాయకులు కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణలో వంశీకృష్ణ

పాఠశాల ఆవరణలో మొక్కలు నాటిన ఎమ్మెల్యే





విశాఖపట్నం సికె న్యూస్ ప్రతినిధి : ఆర్ బి ఎం ఉన్నత పాఠశాలలో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్. గురువారం ఈ కార్యక్రంలో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం, నాణ్యమైన విద్యా బోధన కొనసాగించి, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా బోధించాలి అన్నారు. స్థానిక ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం విద్యార్థులకు అదే పాఠశాలలో 10 వ తరగతి వరకు చదువుకునే అవకాశం కల్పించిన ఎమ్మెల్యే. ఆర్బిఎం స్కూల్లో, ఉన్నత పాఠశాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. స్థానిక ప్రజల ఆకాంక్ష మేరకు, ఎన్నికల సమయంలో స్థానిక ప్రజల వినతి మేరకు, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పదవ తరగతి వరకు అదే పాఠశాలలో చదువుకునే విధంగా అవకాశాన్ని కల్పించారు. ఇప్పటివరకు ఎనిమిదవ తరగతి వరకు విద్యను అభ్యసించి అనంతరం ఉన్నత పాఠశాలకు వేరే స్కూల్లో చేరవలసిన ఆవశ్యకత ఉండేది. ఎమ్మెల్యే వంశీ ప్రత్యేక చొరవ చూపి, ఉన్నత పాఠశాల కొరకు రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే కి స్థానిక ప్రజలు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ తాను మాట ఇచ్చానంటే కచ్చితంగా అమలు చేసి తీరుతానని, విద్యార్థులు ఇబ్బందులు దృష్ట్యా అదే పాఠశాలలో 10 వ తరగతి చదువుకునే అవకాశం కూటమి ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం శ్రీనివాస్, ప్రభాకర్ మాస్టర్, ఎంఈఓ పైడప్ప నాయుడు, పుష్ప రాగిణి, స్కూల్ కమిటీ చైర్మన్ నాగమణి, స్టేట్ డైరెక్టర్ రూప, స్థానిక సీనియర్ నాయకులు గాయత్రి, మహేష్, వార్డు పార్టీ ఇంచార్జ్ డాక్టర్ మర్రివేముల శ్రీనివాస్, స్థాని కార్పొరేటర్ బిపిన్, ఇతర పెద్దలు, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ హయాంలో పలు భూ కుంభకోణాలు

- తమ నేరాలను కప్పి పుచ్చుకునేందుకు కాంగ్రెస్ నేతలపై ఆరోపణలు చేస్తే సహించేది లేదు
- భూ కుంభకోణానికి పాల్పడడం వల్లనే బీఆర్ఎస్ నేత నిరంజన్ గౌడ్ తదితరుల అరెస్ట్
- నిజాయితీగల ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి శిష్యులుగా తాము ఏ తప్పులు చేయం
- బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనారెడ్డి



సికె న్యూస్ చౌటుప్పల్ మండల ప్రతినిధి (శ్రీనివాస్) నవంబర్ 20గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అధికారాన్ని అడ్డం పెట్టుకొని పలువురు ఆ పార్టీ నాయకులు భూ కుంభకోణాలకు పాల్పడినట్లుగా చౌటుప్పల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, మార్కెట్ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి ఆరోదించారు. చౌటుప్పల్ పట్టణంలోని ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి వ్యక్తిగత క్యాంపు కార్యాలయంలో మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, మాజీ జెడ్పిటిసి చిలుకూరి ప్రభాకర్ రెడ్డి, పార్టీ మునుగోడు నియోజకవర్గం ఎన్నికల ఇన్చార్జి పబ్బు రాజు గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బోయ దేవేందర్, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్ లతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని దండు మల్కాపురం గ్రామంలో సుమారు 12 కోట్ల విలువైన ఏ 3.05 గుంటల భూమి కుంభకోణానికి పాల్పడిన మండల పార్టీ అధ్యక్షుడు గిర్కటి నిరంజన్ గౌడ్ తో పాటు మరో ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేయడంతో వారు చేసిన తప్పును కప్పిపుచ్చుకోవడం కోసం కాంగ్రెస్ పార్టీపై, తమ పార్టీ నియోజకవర్గం నాయకులు పబ్బు రాజు గౌడ్ పై బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, వారు చేసిన ఆరోపణలలో ఏమాత్రం నిజం లేదని ఇంద్రసేనారెడ్డి ఖండించారు. నిజాయితీలకు మారుపేరుగా పనిచేస్తున్న తమ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అనుచరులుగా తాము ఎటువంటి తప్పులను చేయమని, ఎవరు తప్పులు చేసిన సహించమని వారు స్పష్టం చేశారు. తప్పులు చేసిన ప్రతి ఒక్కరు శిక్ష అనుభవించక తప్పదన్నారు. తమ పార్టీ అధికారంలో ఉన్నంత మాత్రాన తాము ఎవరిపై కక్ష సాధింపులకు పాల్పడమని, భూ కుంభకోణాలపై అధికారులే విచారణ జరిపి వాస్తవాలను గుర్తించాకే అన్ని ఆధారాలతో భూ కుంభకోణాలకు పాల్పడిన నిందితులను అరెస్టు చేయడం జరుగుతుందని ఇంద్రసేనారెడ్డి తెలిపారు. నిందితులను అరెస్టు చేయడానికి తమ పార్టీకి ఎటువంటి సంబంధం లేదని, నేరం ఎవరు చేసిన చట్టం దృష్టిలో అందరూ సమానమేనని ఆకుల తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో నాయకులు గుండు మల్లయ్య, ఎండి హన్ను, గుర్రం కొండయ్య, వరకాంతం జంగారెడ్డి, కాసర్ల శ్రీనివాస్ రెడ్డి, బాబా షరీఫ్, అర్థ వెంకట్ రెడ్డి, కంచరకుంట్ల రాంరెడ్డి, దుబ్బాక ఆకాష్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

# సమన్వయంతో ఐఎఫ్ఆర్ -2026ను విజయవంతంగా నిర్వహిద్దాం.




ఏర్పాట్ల పై సమీక్షించుకున్న జిల్లా కలెక్టర్, నేవీ ఉన్నతాధికారులు

విశాఖపట్టణం, సికె న్యూస్ ప్రతినిధి : వచ్చే ఏడాది ఫిబ్రవరి 15 నుంచి 20 వ తేదీ మధ్యలో జరగనున్న ఐఎఫ్ఆర్ (ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ) - 2026 ను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం, నేవీ యంత్రాంగం సమన్వయంతో కలిసి పని చేద్దామని జిల్లా అధికారులు, నేవీ ఉన్నతాధికారులు పేర్కొన్నారు. ఇరు వర్గాలు చేయాల్సిన ఏర్పాట్ల పై సుదీర్ఘంగా చర్చించుకున్నారు. ఈ మేరకు గురువారం ఉదయం కలెక్టరేట్ మీటింగు హాలులో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జేసీ కె. మయూర్ అశోక్, వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్ భరత్, డీసీపీ మణికంఠ చందోలు, నేవీ ఉన్నతాధికారులు కమాండర్లు అమీ మాథ్యూ, రజ్నీష్ శర్మ, కెప్టెన్ ఎండీ అనూప్రజ్, కమాండర్లు వైకె కిశోర్, ప్రవీణ్ కుమార్, మనోజ్ కుమార్, కె.ఎన్. మొహంతే, లెఫ్టినెంట్ కమాండర్లు వీరేందర్ కుమార్ తదితర అధికారులు ప్రత్యేకంగా సమావేశ మై వివిధ అంశాల పై చర్చించుకున్నారు. రాష్ట్రపతి, ప్రధాని, రక్షణ మంత్రి, గవర్నర్, ముఖ్యమంత్రి, ఇతర రాజకీయ, అధికార ప్రముఖులు రానున్న నేపథ్యంలో సంబంధిత ఏర్పాట్ల పై సుదీర్ఘంగా సమీక్షించుకున్నారు. ఎవరెవరు ఏయే పనులు చేయాలో, ఏ విధంగా సమన్వయం చేసుకోవాలో ప్రాథమికంగా నిర్ణయించుకున్నారు. ఈ సందర్భంగా కమాండర్లు అమీ మాథ్యూ ఫ్లీట్ రివ్యూ -2026, మిలాన్ నిర్వహణ, అతిథుల రాక తదితర అంశాల పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. సుమారు 100 మిత్ర దేశాల నుంచి అతిథులు విచ్చేస్తారని వారందరికీ రవాణా, వసతి సదుపాయం కల్పించాల్సి ఉందన్నారు. ఫిబ్రవరి 15 నుంచి 20 వ తేదీ వరకు మిలాన్ విలేజ్ కార్యక్రమం కొనసాగుతుందని, 18 న రాష్ట్రపతి ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ, 19 న సిటీ పరేడ్ తో పాటు, మిలాన్ ప్రారంభోత్సవం ఉంటుందని చెప్పారు. 19, 20 వ తేదీల్లో మిలాన్ హార్బర్ ఫేజ్ ఉండగా, 21 నుంచి 25 వ తేదీల వరకు సీ ఫేజ్ ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో భాగస్వామ్య మయ్యేందుకు అతిరథ మహారథులు హాజరవుతున్నారని, సుమారు 100 దేశాల నుంచి విశిష్ట అతిథులు విచ్చేస్తున్నారని తెలిపారు. ఐఎఫ్ఆర్ - 20226, మిలాన్ నేపథ్యంలో కాన్వెంట్ జంక్షన్ నుంచి మారుతీ జంక్షన్ వరకు, అక్కడి నుంచి నేవల్ ఫేస్, హార్బర్ ఫేస్ వరకు ఎన్.హెచ్.ఎ.ఐ., పోర్టు పరిధిలోని రోడ్ల అభివృద్ధి పనులు పూర్తి చేయాల్సి ఉందని పేర్కొన్నారు. ఫ్లై ఓవర్ పనులను త్వరిగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సివిల్ ట్రాఫిక్ మేనేజ్మెంట్ పక్కాగా చేయాలని, పార్కింగ్, శానిటేషన్, సిటీ బ్యూటిఫికేషన్ పనులు సమన్వయంతో చేయాల్సి ఉందన్నారు.

జిల్లా అధికార యంత్రాంగం సన్నద్ధంగా ఉండాలి జిల్లా కలెక్టర్. పలు అంశాల పై స్పందించి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ జిల్లా లోని వివిధ విభాగాల అధికారులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమ నిర్వహణకు సన్నద్ధంగా ఉండాలని, ఇప్పటి నుంచే సంబంధిత పనులను పూర్తి చేసుకోవాలని సూచించారు. ఐఎఫ్ఆర్ తో పాటు, మిలాన్ వేడుకలు కూడా జరుగుతాయి కాబట్టి, దానికి సంబంధించిన ఏర్పాట్లు కూడా చేసుకోవాలన్నారు. రాష్ట్రపతి, దేశ ప్రధాని, ఇతర ప్రముఖులతో పాటు, సుమారు 100 దేశాల నుంచి ప్రతినిధులు వేడుకల్లో భాగస్వామ్యం అవుతారు కావున అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్.హెచ్.ఏ.ఐ., గెయిల్, హెచ్పీసీఎల్ తదితర సంస్థల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని నిర్దేశించారు. రోడ్లు, డ్రెయిన్లు, కాలువల ఆధునికీకరణ, ప్రస్తుతం పోర్టు రోడ్డులో మారుతీ జంక్షన్ వద్ద చేపడుతున్న వంతెన, కల్వర్టుల పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఆయల్, గ్యాస్ పైప్ లైన్ల మార్పులు, కేబుళ్ల మార్పు, ఇతర ప్రక్రియలను ప్రణాళికాయుతంగా చేపట్టాలని చెప్పారు. భద్రతాపరమైన చర్యలు పకడ్బందీగా ఉండాలని, కేంద్ర సంస్థల ప్రతినిధులు, పోలీసులతో సమన్వయం చేసుకోవాలని, ఎలాంటి లోపాలు జరగకుండా జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. సమావేశంలో ఇండియన్ నేవీ, పోలీసు, ఎన్.హెచ్.ఎ.ఐ., గెయిల్, హెచ్పీసీఎల్, బీపీసీఎల్ ప్రతినిధులతో పాటు, ఇన్చార్జి ఆర్డీవో సుధాసాగర్, ఎన్.హెచ్.ఎ.ఐ. పీడీ ప్రభత్ రంజన్, ఇతర విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఫార్మాసిటీలో మత్స్యకారులకు తక్షణమే ఉపాధి కల్పించాలి.

లేదంటే ఫార్మాసిటీ ముట్టడికి సిద్ధం ముత్యాలు



పరవాడ, సికె న్యూస్ ప్రతినిధి : మండలం లోని ముత్యాలమ్మపాలెం పంచాయతీ పరిధిలో జాలారిపేట, దిబ్బపాలెం, ముత్యాలమ్మపాలెం, సమ్మంగిపాలెం చెందిన ఫార్మసిటీ బాదిత మత్స్యకారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సర్పంచ్, ఉమ్మడి విశాఖ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు, రాష్ట్ర మత్స్యకార సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి, పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతకాయల సుజాత ముత్యాలు మాట్లాడుతూ

ఫార్మాసిటీ రామ్ కి సంస్థలు విడిచి పెడుతున్న వ్యర్థ రసాయనాలు నేరుగా సముద్రం లోకి రావడం వలన తరుచు మత్స్య సంపద మృత్యువాత పడుతుందన్నారు. తద్వారాలకు మత్స్యకారులకు తీవ్రమైన నష్టం వాటిల్లుతుందని, మత్స్యకారుల జీవనోపాది చేపలవేట లేక చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఫార్మాసిటీ రామ్కీ కాలుష్యం భారి నుండి మత్స్య సంపదను కాపాడాలని 2012 వ సంవత్సరంలో ఫార్మా సిటీ రామ్కీ గేటు ముందు మత్స్యకారులు పెద్ద ఎత్తున ధర్నా, ఆమరణ నిరాహార దీక్ష చేయడం వలన అప్పుడు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఫార్మాసిటీ రాంకీ యాజమాన్యం మత్స్యకారులకు 500 మందికి ఫార్మసిటిలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని అగ్రిమెంట్ ఇవ్వడం జరిగింది. దీని పై 2023 వ సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు నెల రోజుల్లోగా ఫార్మా సిటీలో ముత్యాలమ్మపాలెం మత్స్యకారులకు ఉద్యోగాలు నియామక ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశాలు ఇచ్చి ఉన్నారు. 2024 వ సంవత్సరంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని, అనకాపల్లి పార్లమెంట్లు సభ్యులు సీఎం రమేష్ ని, పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు ని, అనకాపల్లి ఇన్చార్జ్ మంత్రి కొల్లు రవీంద్ర ని, రాష్ట్ర విద్య శాఖ మంత్రి నారా లోకేష్ ని, కలిసి ఫార్మసిటీలో మత్స్యకారులకు రావలసిన 500 ఉద్యోగాలు, ప్యాకేజీ ఇచ్చి మత్స్యకారులను ఆదుకోవాలని వినతి పత్రాలు సమర్పించడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చి 18 నెలలు గడిచినప్పటికీ ముత్యాలమ్మ పాలెం, మత్స్యకారులకు రామ్ కి నుండి రావలసిన ఉద్యోగ ఉపాధి ప్యాకేజీ ఇవ్వకపోవడం చాలా అన్యాయం కావున తక్షణమే ఫార్మాసిటీ రామ్ కి యాజమాన్యం స్పందించి మత్స్యకారులకు శాశ్వత ఉద్యోగాలు కల్పించడానికి ముందుకు రావలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము అన్నారు. లేని ఎడల మలి దశ ఉద్యమానికి, ఫార్మాసిటీ ముట్టడికి మత్స్యకారులు అంతా సిద్ధంగా ఉన్నామని హెచ్చరిస్తున్నామన్నారు. మత్స్యకారులు చేసే ఉద్యమానికి కూటమి పార్టీ నాయకులు, ఫార్మాసిటీ నిర్వాసితులు, పత్రికా సోదరులు, ప్రజాస్వామ్య వాదులు, మద్దతు ఇవ్వవలసిందిగా కోరుచున్నామని ముత్యాలు అన్నారు. ఈ కార్యక్రమంలో ముత్యాలముపాలెం ఎంపిటిసిలు అర్జిల్లి దేవిరవి, మైలపల్లి అప్పన్న , మాజీ ఎంపిటిసి చింతకాయల అమ్మోరు, మత్స్యకార నాయకులు, కొవిరి రాయుడు, సూరాడ ముత్యాలరావు, సమ్మంగి సోమేశ్వరరావు, ఒలిశెట్టి అప్పలరాజు, ఒలిశెట్టి తాతారావు, చింతకాయల ముత్యాలనాయుడు, అర్జిల్లి అప్పలరాజు, సమ్మంగి అప్పలరాజు, కంబాల గురువోజి, కణితి సోమేష్, సమ్మంగి ముత్యాలు, వార్డ్ మెంబర్లు వలిశెట్టి పోలమ్మ, సూరాడ సత్యవతి, సూరాడ దేవుడమ్మ, బొంది ముత్యాలమ్మ, గ్రామ మత్స్యకార నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే కఠిన చర్యలు

**-మంథని సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ డ్యాగల రమేష్**

సామాజిక మాధ్యమాల్లో ఇరు వర్గాలను రెచ్చగొట్టే విధంగా అనుచిత పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని మంథని సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ డ్యాగల రమేష్ గురువారం హెచ్చరించారు.

ఎవరైనా సరే సామాజిక మాధ్యమాల్లో ఇరువర్గాలను రెచ్చగొట్టే విధంగా, రెండు వర్గాల మధ్య విభేదాలు తలెత్తే విధంగా ఒక వ్యక్తిని, ఒక వర్గాన్ని రెచ్చగొట్టే విధంగా ఒక వ్యక్తిని, ఒక వర్గాన్ని కించపరిచే విధంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టరాదన్నారు. సోషల్ మీడియాలో వ్యక్తులు, వ్యవస్థల ప్రతిష్ట కు భంగం కలిగించేలా, దురుద్దేశాలను ఆపాదిస్తూ, అసత్యాలను ప్రచారం చేస్తూ, ప్రజలను తప్పుదోవ పట్టించేలా, అనుచిత, విద్వేషపూరిత పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.సోషల్ మీడియాను బాధ్యతగా వినియోగించుకోవాలే తప్ప మతం, వర్గ, ప్రాంతీయ భావాలను రెచ్చగొట్టే విధంగా పోస్టులు, వీడియోలు లేదా వ్యాఖ్య లు చేస్తే చట్టపరమైన చర్యలు అనివార్యమని మంథని ఎస్సై డ్యాగల రమేష్ స్పష్టం చేశారు. ఈ విషయాలను మంథని ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన తలసాని

ర: ఆరోగ్యం విషయంలో ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు. గురువారం వెస్ట్ మారేడ్ పల్లి లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ డివిజన్ లకు చెందిన 15 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన 7.57 లక్షల రూపాయల విలువైన ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే అనారోగ్యం బారినపడి చికిత్స కోసం లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి వస్తుందని చెప్పారు. పలు ఆరోగ్య పరమైన సమస్యలు ఎదుర్కొంటున్న వారు ఆర్ధిక ఇబ్బందుల కారణంగా మెరుగైన వైద్యం పొందలేకపోతున్నారని, నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో మెరుగైన వైద్యం అందించాలని పిలుపునిచ్చారు. వైద్య చికిత్సల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కుర్మ హేమలత, మాజీ కార్పొరేటర్ అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, డివిజన్ బి ఆర్ ఎస్ అధ్యక్షులు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, ఆకుల హరికృష్ణ, వెంకటేషన్ రాజు, శ్రీనివాస్ గౌడ్, నాయకులు నాగులు, శ్రీహరి, కొండాపురం మహేష్ యాదవ్, లక్ష్మీపతి, శేఖర్, ప్రేమ్, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల కష్టాలు తీరలేదు.. సౌకర్యాలు పెరగలేదు

జాగృతి జనంబాట కార్యక్రమంలో భాగంగా రంగారెడ్డి జిల్లాలో పర్యటించేందుకు వచ్చిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకి తెలంగాణ జాగృతి నాయకులు ఘన స్వాగతం పలికారు. సే నో డ్రగ్స్ క్యాంపెయిన్ లో భాగంగా విద్యార్థులతో కలిసి ర్యాలీలో కవిత పాల్గొన్నారు.

కవిత మాట్లాడుతూ జాగృతి జనం బాటలో భాగంగా రంగారెడ్డి జిల్లాలో పర్యటిస్తున్నాం. శేరిలింగంపల్లి నుంచి మా పర్యటనను మొదలు పెట్టాం. శేరిలింగంపల్లి నియోజకవర్గం చాలా పెద్దది. కానీ ఇక్కడ పేదలు, పేద బస్తీలు చాలా ఉన్నాయి. ఆ ప్రజల సమస్యలు తెలుసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తాం. 2014 లో ఇక్కడ 64 చెరువులు ఉంటే అనేక చెరువులు కబ్జా అయ్యాయని అన్నారు. ఈ విషయాన్ని హైదరాబాద్, తెలంగాణ ప్రజలు గమనించాలి. ఒక పక్క తెలంగాణకు వారసత్వంగా వచ్చిన ఆస్తులు పోయాయి. పేదల కష్టాలు ఏ మాత్రం తీరలేదు. వారికి ఫెసిలిటీస్ పెరగలేదు. ట్రాఫిక్ కష్టాలు పెరిగాయి. అన్ని ప్రాంతాల నుంచి ఇక్కడ సెటిలైన వారు ఇబ్బందులు పడుతున్నారు. ఇవ్వాళ యువమిత్రులతో కలిసి నో టు డ్రగ్స్ అనే కార్యక్రమం చేపట్టాం. మత్తుకు బానిసైన యువత ను ఆ ఊబి నుంచి ఏలా బయటకు తేవాలన్న దానిపై జాగృతి కృషి చేస్తుందని అన్నారు.

# కూకట్ పల్లిలో కళ్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ రసాభస

:కూకట్ పల్లి మండల కార్యాలయంలో కళ్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ రసాభసగా మారింది. ప్రోటోకాల్ ప్రకారం కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హాజరయ్యారు. ఎమ్మెల్యే ఎమ్మార్వో కార్యక్రమంలో ఓ ఐదుగురికి చెక్కులు ఇచ్చారు. అదే సమయంలో మండల కార్యాలయానికి చేరుకున్న కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ బండి రమేష్ చీకటి గదిలో చెక్కులు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. ఎమార్వో డౌన్ డౌన్ అంటూ కాంగ్రెస్ కార్యకర్తలు నినాదాలు చేసారు. చివరకు కేపీహెచ్బీ సీఐ జోక్యంతో గొడవ సద్దు మణిగింది.

# కాంగ్రెస్ లోకల్ కసరత్తు



లోకల్ పోరుకు ముందు తెలంగాణలో సరికొత్త రాజకీయం. అసలే నువ్వానేనా అన్నట్లుగా నడుస్తోన్న పొలిటికల్ ఫైట్‌లో..అప్పర్ హ్యాండ్ కోసం అటు కాంగ్రెస్..ఇటు బీఆర్ఎస్ ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నాయి. పత్తి కొనుగోళ్ల కోసం సీసీఐ పెట్టిన రూల్స్‌లో రైతులు అవస్థలు పడుతున్నారని ఎక్స్‌పోజ్ చేస్తోంది బీఆర్ఎస్. గతంలోనూ స్థానిక ఎన్నికలకు సిద్ధమైన టైమ్‌లోనే యూరియా కొరత సర్కార్‌ను రోడ్డుకు ఈడ్చింది. ఇప్పుడు కాటన్ పాలిటిక్స్‌కు అధికార పార్టీని కలవరపెడుతున్నాయి. జూబ్లీహిల్స్ బైఎలక్షన్ హడావుడి అయిపోయింది. ఇక ఇప్పుడు రూరల్ తెలంగాణ మీద ఫోకస్ పెట్టింది బీఆర్ఎస్. అసలే స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయి. పైగా రైతుల సమస్యలు హైలెట్ చేస్తేనే తమకు ప్రజాదరణ దక్కుతుందని లెక్కలు వేసుకుంటోంది కారు పార్టీ. ఈ క్రమంలోనే ఆదిలాబాద్‌లో కేటీఆర్, వరంగల్‌లో హరీశ్‌రావు పత్తి రైతులను కలిసి వాళ్లు ఎదుర్కొంటున్న అవస్థలను తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలోనే పత్తి కొనుగోళ్ల అంశం పెద్ద దుమారమే రేపుతోంది. సీసీఐ.. పెడుతున్న కొర్రీలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ తమ గొంతు కలుపుతోంది.సరిగ్గా స్థానిక ఎన్నికలకు ముందు పత్తి కొనుగోళ్ల అంశం తెరమీదకు రావడంతో అధికార కాంగ్రెస్ ఆందోళన చెందుతోందట. గతంలోనూ కాంగ్రెస్ సర్కార్ లోకల్ బాడీ ఎన్నికలకు రెడీ అయిన టైమ్‌లోనే..యూరియా కష్టాలు అధికార పార్టీని కలవరపెట్టాయి. బస్తా యూరియా కోసం రైతులు రోడ్డెక్కి ఆందోళన చేయడం..అప్పటికి ఇప్పటికి తేడాను పోలుస్తూ బీఆర్ఎస్ అటాక్ చేసింది. దీంతో స్థానిక ఎన్నికలు పెడితే ఓడిపోవడం ఖాయమని ఎమ్మెల్యేలు తెగేసి చెప్పేయడంతో కాంగ్రెస్ సర్కార్ బ్యాక్ స్టెప్ వేసిందన్న టాక్ ఉంది.ఇప్పుడు మళ్లీ స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ రాబోతున్న వేళ పత్తి కొనుగోళ్ల ఇష్యూ చర్చకు దారి తీస్తోంది. ఇది కూడా రైతులకు ముడిపడిన అంశం. పైగా గ్రామీణ తెలంగాణలో ప్రభావం చూపిస్తుంది కూడా. అందుకే పత్తి కొనుగోళ్ల అంశాన్ని బీఆర్ఎస్ హైలెట్ చేస్తోందన్న చర్చ మొదలైంది. ఇదే అధికార పార్టీని కలవరపెడుతోందట. అయితే అప్పుడు యూరియా అయినా..ఇప్పుడు పత్తి కొనుగోళ్లు అయినా రెండూ కేంద్ర పరిధిలోనివే. యూరియా పూర్తిగా కేంద్రం నుంచి రావాల్సి ఉన్నా..అడ్వాన్స్‌గా యూరియా తెప్పించుకోవడంలో తెలంగాణ ప్రభుత్వం ఫెయిల్ అయిందన్న విమర్శలు వచ్చాయి. ఇప్పుడు పత్తి కొనుగోళ్లు కూడా కేంద్రం పరిధిలోని సీసీఐ పర్యవేక్షణలో కొనసాగుతోంది.సీసీఐ తీసుకొచ్చిన కొత్త నిబంధనలే తెలంగాణ రైతంగానికి శాపంగా మారాయంటున్నారు. అయితే నిబంధనలు పెట్టింది సీసీఐ అయినప్పటికీ..రాష్ట్ర వ్యవసాయ శాఖ ముందుగానే మేల్కొని ఉంటే ఈ ఇబ్బందులు వచ్చేవి కావంటోంది బీఆర్ఎస్. తమ హయాంలో రైతులకు చిన్న ఇబ్బంది రాకుండా జాగ్రత్తలు తీసుకున్నామని చెబుతోంది. తేమ శాతం, ఫింగర్ ప్రింట్ విధానం అంటూ రైతులను ఇబ్బంది పెడుతున్నారని దుమ్మెత్తిపోస్తోంది అపోజిషన్. తేమ శాతం, సీసీఐ నిబంధనలను సడలించే వరకు పోరాడుతామంటోంది బీఆర్ఎస్.అయితే అన్ని పార్టీల కంటే కారు పార్టీ పత్తి రైతుల అంశాలను హైలెట్ చేస్తోంది. అది కూడా లోకల్ బాడీ ఎన్నికలకు ముందు. రాబోయే రోజుల్లో ఎక్కడిక్కడ ధర్నాలు, రాస్తారోకోలకు బీఆర్ఎస్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే అధికార కాంగ్రెస్‌కు గుబులు పుట్టిస్తోంది. అటోఇటో జూబ్లీహిల్స్‌లో అయితే మంచి మెజార్టీతో గెలిచాం కానీ..స్థానిక ఎన్నికల్లో సత్తా చాటకపోతే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పుట్టి మునుగుతుందని టెన్షన్ పడుతోందట అధికార పార్టీ.తెలంగాణలో ఈసారి 45.32 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగైందని లెక్కలు చెబుతున్నాయి. 28.29 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వచ్చిందట. సీసీఐ కొత్త నిబంధనలే ఇప్పుడు పత్తి కొనుగోళ్ల పంచాయితీకి కారణమవుతున్నాయి. పత్తి కొనుగోలు చేసే జిన్నింగ్ మిల్లులకు గ్రేడింగ్ విధానాన్ని ప్రవేశపెట్టింది సీసీఐ. ఎల్-1, ఎల్-2 ఎల్-3 విధానాన్ని తీసుకురావడంతో..కొత్త తలనొప్పులు వచ్చాయి.తెలంగాణలో ఎకరాకు 10 నుంచి 14 క్వింటాళ్ల వరకు పత్తి దిగుబడి వస్తుంది. కానీ ఎకరాకు 7 క్వింటాళ్లు మాత్రమే తీసుకుంటామని షరతులు పెట్టింది సీసీఐ. జిన్నింగ్ మిల్లులు 325 ఉంటే..కొనుగోళ్లు చేసేందుకు 256 మిల్లులకు మాత్రమే పర్మిషన్ ఇచ్చింది. దీంతో సీజన్ ప్రారంభమై నెల రోజులైనా..ఇప్పటివరకు లక్ష క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేశారు. చాలా మిల్లుల దగ్గర కొనుగోలు ప్రారంభం కాకపోవడంతో రైతులు ఆందోళన బాట పడుతున్నారు. అన్నదాతలకు తోడుగా ప్రతిపక్ష బీఆర్ఎస్ కూడా రోడ్డెక్కుతోంది. ఇదే ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్‌కు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. లోకల్ పోరుకు ముందు కాటన్ పాలిటిక్స్ ఎలా ఎఫెక్ట్ చూపిస్తాయో చూడాలి.

# ఆ ఇద్దరు మంత్రుల పోస్టులు ఊస్టేనా



ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో ఉప ఎన్నిక జరిగింది. ఈ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజారిటీతో విజయం సాధించారు. ఈ గెలుపు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి సంజీవనిగా మారింది. ఫలితంగా ముఖ్యమంత్రి రేవంత్ స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకోగలుగుతున్నారు. పార్టీ మీద పట్టు పెంచుకున్నారు. పార్టీ హై కమాండ్ కూడా ఆయనకు ఫుల్ సపోర్ట్ చేస్తోంది. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ గెలవడం.. ఇద్దరు మంత్రుల పోస్టులను ఊస్ట్ అయ్యేలా చేస్తోంది.జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం అందరి మంత్రులకు అప్పగించింది. అయితే ఇందులో దక్షిణ తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఇద్దరు మంత్రులు సరిగ్గా పనిచేయలేదు. కార్యకర్తలకు అందుబాటులో లేరు. పైగా టచ్ మీ నాట్ అన్నట్టుగా వ్యవహరించారు. సదరు మంత్రుల పనితీరుపట్ల అధిష్టానానికి ఇంటలిజెన్స్ వర్గాలు నివేదిక అందించినట్లు తెలుస్తోంది. పైగా ఆ ఇద్దరు మంత్రులు తమకు కేటాయించిన డివిజన్లలో చుట్టపుచూపుగా వచ్చి ప్రచారం చేశారు. సీరియస్ ఎఫర్ట్ పెట్టలేదని ఇంటెలిజెన్స్ వర్గాలు చెబుతున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఆగ్రహానికి గురైన పార్టీ హై కమాండ్ వారిని వివరణ ఇవ్వాలని అడిగినట్టు తెలుస్తోంది.జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో ప్రచార బాధ్యతలను కాంగ్రెస్ పార్టీ అందరికీ అప్పగించింది. ఒక్కో డివిజన్ కు ఇద్దరు మంత్రులను ఇన్చార్జులుగా నియమించింది. ఇన్చార్జిలంతా తమ జిల్లాలలో.. నియోజకవర్గాలలో నాయకులను, ఇతర కార్యవర్గాన్ని తీసుకొచ్చి ఎన్నికల ప్రచారం జరపాలని మీనాక్షి నటరాజన్ ఆదేశించారు. ఆమె ఆదేశాల మేరకు మంత్రులు మొత్తం ప్రచార బాధ్యతలను భుజాలకు ఎత్తుకున్నారు. ఉదయం ఏడు గంటల నుంచి మొదలు పెడితే సాయంత్రం వరకు ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారుఆ ఇద్దరు మంత్రులు అంతంత మాత్రమే పనిచేశారు. పైగా పార్టీలో సీనియర్లుగా ఉన్న తమకు డివిజన్ బాధ్యతలు అప్పగించడం పట్ల వారు నారాజ్ గా వివరించినట్టు సమాచారం. పైగా తమ నియోజకవర్గం నుంచి నాయకులను, లీడర్లను ప్రచారంలో ముందుండేలా చేయలేదని ఆరోపణలు వినిపిస్తుంది. మరోవైపు జూబ్లీహిల్స్ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఓడిపోవాలని ఆ ఇద్దరు మంత్రులు కోరుకున్నారని హైకమాండ్ కు ఇంటెలిజెన్స్ వర్గాలకు తెలిసింది. నిఘా వర్గాలు ఎప్పటికప్పుడు సమాచారాన్ని మీనాక్షి తో పాటు రేవంత్ రెడ్డికి కూడా అందించాయి.ఇందులో ఒక మంత్రి పార్టీ ఇచ్చిన డబ్బులు పూర్తిస్థాయిలో ఖర్చుపెట్టలేదని.. చాలావరకు మిగిలించుకొని తన జేబులో వేసుకున్నారని విమర్శలు ఉన్నాయి. ఒకవేళ ఈ ఇద్దరు మంత్రులు గనుక తమ

వ్యక్తిగత ఎజెండాను పక్కనపెట్టి ముందుకు వెళితే.. ప్రచారం సక్రమంగా చేస్తే మెజారిటీ ఇంకా ఎక్కువగా వచ్చేదని పార్టీ కార్యకర్తలు చెబుతున్నారు. పార్టీ అభ్యర్థి ఓడిపోవాలని కోరుకున్న ఆ ఇద్దరు మంత్రుల పోస్టులు ఊస్ట్ అయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. అధిష్టానం వర్తమానం పంపడంతో ఇప్పటికే ఒక మంత్రి ఢిల్లీకి వెళ్లి వివరణ ఇచ్చినట్టు తెలుస్తోంది. మరో మంత్రి హస్తిన వెళ్లడం లేదా మెయిల్ ద్వారా తన వివరణ ఇచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

# సిటీ బస్సులకు హైడ్రాలిక్ డోర్స్...

బస్సుల్లో ఫుట్‌బోర్డు ప్రయాణాలకు చెక్ పెట్టేందుకు టీజీఎస్ఆర్టీసీ కొత్త ఎలక్ట్రిక్ బస్సుల్లో హైడ్రాలిక్ ఆటోమేటిక్ డోర్లు తెచ్చింది. బస్సు ఆగితేనే డోర్లు తెరుచుకుంటాయి, కదులుతుంటే ఆటోమేటిక్‌గా మూసుకుంటాయి. ముఖ్యంగా విద్యార్థుల భద్రత కోసం ఈ వినూత్న మార్పులు చేశారు. ఈ కొత్త బస్సులు ప్రమాదాలను తగ్గించి, ప్రయాణాన్ని సురక్షితంగా మారుస్తాయని అధికారులు ఆశిస్తున్నారు.హైలైట్:ఫుట్‌బోర్డు ప్రయాణాలు, ప్రమాదాలకు చెక్బస్సుల్లో ఫుట్‌బోర్డు ప్రయాణాలు, కదులుతున్న బస్సుల నుంచి దిగడం వంటి ప్రమాదకర విన్యాసాలకు అడ్డుకట్ట వేసేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వినూత్న మార్పులు చేపట్టింది. ప్రయాణికుల, ముఖ్యంగా విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని కొత్తగా ప్రవేశపెడుతున్న ఎలక్ట్రిక్ బస్సుల్లో అత్యాధునిక హైడ్రాలిక్ ఆటోమెటిక్ డోర్ వ్యవస్థను ఏర్పాటు చేస్తోంది. స్టేజీ వద్ద బస్సు పూర్తిగా ఆగినప్పుడు మాత్రమే ఈ డోర్లు తెరుచుకుంటాయి. బస్సు కదులుతున్నప్పుడు లేదా వేగంగా ఉన్నప్పుడు ఇవి ఆటోమెటిక్‌గా మూసుకుని లాక్ అవుతాయి. దీనివల్ల ప్రయాణికులు పరిగెత్తుకుంటూ వచ్చి బస్సు ఎక్కడం, కదులుతున్న బస్సు నుంచి దిగిపోవడం లేదా ఫుట్‌బోర్డుపై వేలాడటం కుదరదు. ఈ వ్యవస్థ విమానాశ్రయ బస్సులు (ఏసీ ఇంద్ర), హైఎండ్ డీలక్స్ బస్సుల్లో ఉండే సాంకేతికత తరహాలో పనిచేస్తుంది.యినగరంలో జరిగిన ప్రమాదాలపై ఆర్టీసీ అధికారులు లోతుగా అధ్యయనం చేశారు. ఎక్కువ ప్రమాదాలు ఫుట్‌బోర్డు ప్రయాణాల వల్లే జరుగుతున్నాయని గుర్తించిన అధికారులు, ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉన్న మార్గాలపై దృష్టి సారించారు. ప్రయోగాత్మకంగా హయత్‌నగర్-2 డిపో పరిధిలో 45 'గ్రీన్ మెట్రో ఎక్స్‌ప్రెస్' ఎలక్ట్రిక్ బస్సులను సిద్ధం చేశారు. ప్రస్తుతం 10 బస్సులు ఇప్పటికే రోడ్డెక్కాయి. ముఖ్యంగా విద్యార్థులు అధికంగా ప్రయాణించే హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం మార్గాల్లో ఈ హైడ్రాలిక్ డోర్ వ్యవస్థ ఉన్న బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చారు. హకీంపేట కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న డ్రైవర్లు రాగానే.. మిగిలిన 35 బస్సులు కూడా త్వరలో తిరగనున్నాయి. డిసెంబరు నాటికి మరిన్ని ఈ-బస్సులు ఈ మార్గాల్లో అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు.ఈ కొత్త ఎలక్ట్రిక్ బస్సులు ఒక్కొక్కటి సుమారు 60 మంది ప్రయాణికులు సౌకర్యవంతంగా కూర్చుని లేదా నిలబడి ప్రయాణించేలా రూపొందించబడ్డాయి. వీటి ద్వారా ఆక్యుపెన్సీ పెరుగుతుందని డిపో అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. మేడ్చల్ %-% సికింద్రాబాద్, సికింద్రాబాద్ %-% దిల్?సుఖ్?నగర్, సికింద్రాబాద్ %-% ఉప్పల్, కోఠి %-% రామంతాపూర్, మెహిదీపట్నం %-% ఆరాంఘర్, ఎల్బీనగర్ %-% ఇబ్రహీంపట్నం, ఉప్పల్ %-% ఘట్‌కేసర్ మార్గాల్లో విద్యార్థులు భారీ సంఖ్యలో రాకపోకలు సాగిస్తారు. కాబట్టి ఇక్కడ ఈ కొత్త బస్సులను అత్యధిక సంఖ్యలో ప్రవేశపెట్టడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా అరికట్టవచ్చునని అధికారులు భావిస్తున్నారు. ఈ కొత్త భద్రతా చర్యల వల్ల ఫుట్‌బోర్డు ప్రమాదాలు తగ్గుతాయని.. ప్రయాణం సురక్షితంగా మారుతుందని ఆర్టీసీ ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

### డేటా షేరింగ్‌కు జొమాటో, స్విగ్గీ గ్రీన్ సిగ్నల్.. !

## ఫుడ్ ఆర్డర్ చేస్తే మీ ఫోన్ నంబర్ రెస్టారెంట్‌కు తెలుస్తుందా... ?




చాలా కాలంగా జరుగుతున్న పోరాటం తర్వాత జొమాటో (Zomato ) ఇప్పుడు రెస్టారెంట్ యజమానులతో కస్టమర్ల ఫోన్ నంబర్‌లను షేర్ చేసుకునేందుకు అంగీకరించింది. దీనివల్ల కస్టమర్‌లకు మరింత మెరుగైన సేవలు ఇవ్వవచ్చని రెస్టారెంట్లు చెబుతున్నాయి. నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (NRAI) అనే రెస్టారెంట్ల సంఘం జొమాటో & స్విగ్గీ (Swiggy) కస్టమర్ డేటాను షేర్ చేసుకోవడం లేదని చాలా కాలంగా ఫిర్యాదు చేస్తోంది.అలాగే తాము లక్ష్యంగా చేసుకుని మార్కెటింగ్ చేయలేకపోతున్నామని, ఏ కస్టమర్ మా దగ్గర ఎంత ఎక్కువగా ఆర్డర్ చేస్తున్నారో తెలియడం లేదని రెస్టారెంట్లు వాదిస్తున్నాయి. చాలా పోరాటం తర్వాత Zomato ఇప్పుడు కస్టమర్ ఫోన్ నంబర్‌ను రెస్టారెంట్‌లతో షేర్ చేసుకునేందుకు ఒప్పుకుంది. రెస్టారెంట్ యజమానులు దీనిని మా పరిశ్రమకు పెద్ద విజయంగా భావిస్తున్నారు.

ఎందుకంటే ఆర్డర్‌లో ఏదైనా సమస్య ఉంటే లేదా ఆర్డర్ వివరాల గురించి వెంటనే క్లారిటీ కావాలంటే రెస్టారెంట్ ఓనర్లు ఇకపై కస్టమర్‌కు నేరుగా కాల్ చేయవచ్చు. ఇంతకుముందు కస్టమర్‌లు రెస్టారెంట్‌లకు కాల్ చేసేవారు, కానీ రెస్టారెంట్లు కస్టమర్‌లకు కాల్ చేయలేకపోయాయి. ఈ నిర్ణయంపై నెటిజన్లు, సోషల్ మీడియా యూజర్లు మాత్రం తీవ్రంగా అసంతృప్తిని వ్యక్తం చేస్తూ మండిపడుతున్నారు. ఇది మా ప్రైవసీని భంగం కలిగించడమే అని, కస్టమర్ డేటాను షేర్ చేసుకోవడం పూర్తిగా ఆపేయాలని డిమాండ్ చేస్తున్నారు.ఫోన్ నంబర్ షేరింగ్ అనేది కేవలం స్టార్టింగ్ మాత్రమే అని, భవిష్యత్తులో ఆర్డర్ చేసిన వస్తువులు, ఆర్డర్ హిస్టరీ వంటి ఇతర డేటా కూడా షేర్ అవుతుందని ఆందోళన తెలుపుతున్నారు. సమాచారం ప్రకారం, కస్టమర్ల అంగీకారం తీసుకున్న తర్వాతే వారి డేటా/ఫోన్ నంబర్ రెస్టారెంట్‌లతో షేర్ చేసుకోవచ్చు. Swiggy కూడా ఇదే విధంగా డేటాను షేర్ చేసుకునేందుకు అంగీకరిస్తుందో లేదో వేచి చూడాలి.దేశవ్యాప్తంగా 5 లక్షల కంటే ఎక్కువ రెస్టారెంట్లకు ప్రాతినిధ్యం వహిస్తున్న నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (NRAI), ఆన్‌లైన్ ఫుడ్ అగ్రిగేటర్ Zomato, Swiggy అనుసరిస్తున్న పద్ధతుల గురించి కొంతకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తోంది.

# మీ ఆహారంలో 'మెగ్నీషియం' ఉందా..?

## మెగ్నీషియంతో నియంత్రణలో రక్తపోటు, మధుమేహం

## అలసిపోయిన వారికి దీనితో శక్తి

## మంచి నిద్రకు, ఒత్తిడి నుంచి ఉపశమనం

మెగ్నీషియం అనేది ఎంతో ముఖ్యమైన ఖనిజం. మన శరీరంలోని ఎన్నో జీవక్రియలకు ఇది అవసరం. దీన్ని తగినంత తీసుకోవడం వల్ల ఎన్నో రకాల అనారోగ్యాలకు దూరంగా ఉండొచ్చు. కనుక తీసుకునే ఆహారంలో తగినంత మెగ్నీషియం ఉండేలా జాగ్రత్త పడాలి.

**ప్రయోజనాలు**

రక్తనాళాలను వ్యాకోచించేలా మెగ్నీషియం చేస్తుంది. దీనివల్ల రక్తపోటు నియంత్రణలోకి వస్తుంది. హైపర్ టెన్షన్ రిస్క్ తగ్గుతుంది. గుండె జబ్బుల నుంచి రక్షణ లభిస్తుంది.

ఎముకల సాంద్రతకు మెగ్నీషియం కావాలి. ఎముకలు బలంగా ఉండేందుకు, ఆస్టియో పోరోసిస్ బారిన పడకుండా మెగ్నీషియం రక్షణనిస్తుంది.

మెగ్నీషియంలో ఉన్న ప్రయోజనాల్లో ముఖ్యమైనది శక్తిని ఉత్పత్తి చేయడం. అలసిపోయినట్టుగా అనిపించే వారికి, తమ పనులు చేయడానికి శక్తి చాలడం లేదన్న భావనతో ఉండే వారికి మెగ్నీషియం అవసరం ఇంకా ఎక్కువ ఉందని అర్థం చేసుకోవచ్చు.

ఒత్తిడి హార్మోన్లను నియంత్రించడానికి




మెగ్నీషియం కావాలి. మెదడుకు విశ్రాంతిని కూడా ఇస్తుంది. స్ట్రెస్ ను నియంత్రించి, మంచి నిద్రకు సాయపడుతుంది.

మహిళల్లో నెలసరి సమయంలో వచ్చే నొప్పి సమస్యకు మెగ్నీషియం ఔషధంగా పనిచేస్తుంది. రోజువారీ మెగ్నీషియం తీసుకోవడం వల్ల గర్భాశయ కండరాలకు విశ్రాంతి లభిస్తుంది. దీంతో నొప్పులు, తిమ్మిర్లు రాకుండా చూస్తుంది.

మైగ్రేయిన్ తలనొప్పితో బాధపడే వారు రోజువారీ 400-500 మిల్లీ గ్రాముల మెగ్నీషియం తీసుకోవడం వల్ల ఉపశమనం లభిస్తుంది. మధుమేహం నియంత్రణకు కూడా మెగ్నీషియం సాయపడుతుంది. మధుమేహం ఉన్న వారిలో సాధారణంగా మెగ్నీషియం లోపం కనిపిస్తుంటుంది. కనుక రోజువారీ ఆహారంలో మెగ్నీషియం లభించేలా చేసుకోవాలి.

# చలికాలంలో ఆరోగ్య మంత్రం.. ఫిట్ నెస్, బ్రీతింగ్ టిప్స్ ఇవిగో



చలికాలం వచ్చేసింది.. రోజు రోజుకు ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో పడిపోతున్నాయి. ఉదయం 9 గంటల అయినా చలి కొరికేస్తుంది. ఉదయాన్నే బయటికి రాకుండా ఇంటికే పరిమితం అవుతారు. వింటర్? సీజన్? లో యాక్టివ్?గా, ఆరోగ్యంగా ఉండాలంటే చాలా ముఖ్యమైనది వ్యాయామం. వ్యాయామం శరీరాన్ని వెచ్చగా చేయడమే కాకుండా రోగనిరోధక శక్తిని పెంచుతుంది..యాక్టివ్? గా ఉంచుతుంది. గుండె, ఊపిరితిత్తులను బలోపేతం చేస్తుంది.. అయితే కోల్డ్? వెదర్? లో వ్యాయామం చేసేందుకు ఓ ప్రత్యేక ప్రణాళిక అవసరం. చలికి మీ శరీరం ఎలా స్పందిస్తుందో అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. కొన్ని శ్వాసకు సంబంధించిన టిప్స్ నేర్చుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చంటున్నారు ఆరోగ్య నిపుణులు. చలి శరీరాన్ని, శ్వాసను ఎలా ప్రభావితం చేస్తుందంటే..

వాయుమార్గాలు ఇరుకుగా ఉండటం వల్ల శ్వాస ఆడకపోవడం

చల్లని గాలి పీల్చడం వల్ల గొంతు ఎండిపోవడం లేదా దగ్గు

చలిలో వశ్యత తగ్గడం వల్ల కండరాలు బిగుతుగా లేదా నొప్పిగా ఉండటం

ప్రతిచర్య సమయం ,కండరాల పనితీరు నెమ్మదిస్తుంది

**వింటర్? లో బహిరంగ ప్రదేశాల్లో వ్యాయామాలు,..**

పొరలుగా దుస్తులు ధరించండి: చర్మానికి దగ్గరగా తేమను పీల్చే దుస్తులను ధరించండి..ఇన్సులేటింగ్ పొరను ధరించి దానిపై గాలి నిరోధక జాకెట్ వేయండి. పొరలు శరీర వేడిని బంధించి, వశ్యతను అందిస్తాయి.

మొదట ఇంట్లోనే బయటకు వెళ్ళే ముందు శరీర ఉష్ణోగ్రతను పేంచేందుకు,కండరాలను సడలించేందుకు లైట్ స్ట్రెచింగ్, జంపింగ్ జాక్స్ లేదా ఇంటి లోపల వేగంగా నడవడం చేయాలి

మీ చేతులు, కాళ్ళు ,తల త్వరగా వేడిని కోల్పోతాయి కాబట్టి చేతి తొడుగులు, వెచ్చని సాక్స్ ,టోపీని ధరించాలి

అతిగా ఎక్స్‌పోజర్ అవ్వకుండా ..

చలి ఎక్కువగా ఉన్నప్పుడు తక్కువ వ్యాయామం చేయాలి. అంటే 30%-%45 నిమిషాలు మాత్రమే చేయాలి. ఎక్కువసేపు వ్యాయామాలు చేయడం వల్ల డీహైడ్రేషన్? జరిగే అవకాశం ఉంటుంది.

మీ ముక్కు గాలి ..నాసికా శ్వాస గాలి మీ ఊపిరితిత్తులకు చేరే ముందు దానిని వేడి చేస్తుంది, తేమ చేస్తుంది .చల్లని గాలి షాక్‌ను తగ్గిస్తుంది.

**ఇండోర్ వ్యాయామం..**

శరీర బరువు వ్యాయామాలు: పుష్-అప్స్, స్క్వాట్స్, లంజస్, ప్లాంక్‌లు ,బర్పీలు పూర్తి శరీర వ్యాయామం ఇస్తాయి.

యోగా ,పైలేట్స్: సమతుల్యత, లోతైన శ్వాస కోసం అద్భుతమైనది.

డ్యాన్స్?..మీ మానసిక స్థితిని పెంచుకుంటూ కేలరీలను బర్న్ చేసేందుకు మంచి మార్గం.

రెసిస్టెన్స్ బ్యాండ్ ..బలాన్ని పెంచేందుకు కాంపాక్ట్ ,ప్రభావవంతమైనది.

హెూమ్ కార్డియో: మీ హృదయ స్పందన రేటును పెంచేందుకు స్కిప్పింగ్ రోప్, ట్రెడ్‌మిల్ లేదా మెట్లు ఎక్కడం ఉపయోగించాలి

**పోషకాహారం, హైడ్రేషన్..**

వేసవిలో ఎంత ముఖ్యమో శీతాకాలంలో కూడా హైడ్రేటెడ్ గా ఉండటం ,బాగా తినడం కూడా అంతే ముఖ్యం. చలికాలం దాహాన్ని తగ్గిస్తుంది. దీనివల్ల నీరు త్రాగడం మర్చిపోయే ప్రమాదం ఉంది.

**హైడ్రేషన్ చిట్కాలు..**

రోజంతా గోరువెచ్చని నీరు లేదా హెర్బల్ టీలు త్రాగండి. అధిక కెఫిన్‌ను వద్దు. ఇది మిమ్మల్ని డీహైడ్రేట్ చేస్తుంది. నారింజ, దోసకాయలు వంటి అధిక నీటి శాతం ఉన్న పండ్లు, కూరగాయలు తినాలి.

**ఆరోగ్యానికి పోషకాహారం..**

విటమిన్లు ,యాంటీఆక్సిడెంట్ల కోసం క్యారెట్లు, పాలకూర ,సిట్రస్ పండ్లు వంటి సీజనల్? ఫ్రూట్స్? తినాలి.

కండరాలను రిపేర్ చేసేందుకు గుడ్లు, చేపలు ,చిక్కుళ్ళు వంటి లీన్ ప్రోటీన్ తీసుకోవాలి.

ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు (వాల్‌నట్‌లు ,అవిసె గింజలలో లభిస్తాయి) గుండె ,కీళ్ల ఆరోగ్యానికి తోడ్పడతాయి.

స్థిరమైన శక్తి కోసం తృణధాన్యాలను తీసుకోవాలి.

సమతుల్య పోషకాహారం రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది.వ్యాయామం నుంచి తర్వాత శక్తినిస్తుంది. వింటర్ లో మీరు ఆరోగ్యంగా ఉండటానికి సహాయపడుతుంది.

### డేంజర్‌లో వాట్సాప్ యూజర్ల డేటా:

## 350 కోట్ల మంది ప్రొఫైల్ పిక్చర్, స్టేటస్, వివరాలు లీక్...!



ప్రపంచవ్యాప్తంగా ఉన్న 350 కోట్లకు పైగా వాట్సాప్ యూజర్ల వ్యక్తిగత వివరాలు ప్రమాదంలో పడ్డాయి. యాప్‌లో ఉన్న ఒక పెద్ద లోపం (Error) కారణంగా యూజర్ల ఫోన్ నంబర్లు, ప్రొఫైల్ ఫోటోలు, స్టేటస్ ఇంకా About' సెక్షన్ వివరాలు బయటకు లీక్ (Leak) అయ్యే అవకాశం ఉందని వియన్నా యూనివర్సిటీ పరిశోధకులు గుర్తించారు. ఈ ఎర్రర్ ద్వారా స్కామర్లు (Scammers) ఏదైనా ఫోన్ నంబర్ పై వాట్సాప్ ఉందో లేదో తెలుసుకోవచ్చు. తర్వాత నంబర్‌కు సంబంధించిన ప్రొఫైల్ ఫోటో, స్టేటస్, About వివరాలను చెడు పనులకు వాడుకునే అవకాశం ఉంది.ఈ లోపం వాట్సాప్‌లోని 'కాంటాక్ట్ డిస్కవరీ' అనే ఫీచర్‌లో ఉందని పరిశోధకులు చెప్పారు. ఈ ఫీచర్ ద్వారా పెద్ద మొత్తంలో యూజర్ల డేటాను దొంగిలించడానికి ఛాన్స్ ఉంది. పరిశోధనలో తేలింది ఏంటంటే పరిశోధకులు 245 దేశాలకు చెందిన దాదాపు 6300 కోట్ల నంబర్లను టెస్ట్ చేశారు. వీటిలో 350 కోట్ల యాక్టివ్ వాట్సాప్ అకౌంట్స్ ఉన్నట్టు కనిపెట్టారు. 56.7% మంది యూజర్ల ప్రొఫైల్ ఫోటోలు, 29.3% మంది యూజర్ల 'About వివరాలు బయటపడ్డాయి. ఈ వివరాలలో రాజకీయ అభిప్రాయాలు, మతం లేదా ఇతర సోషల్ మీడియా లింక్‌లు కూడా ఉన్నాయి. ప్రపంచంలోని మొత్తం 350 కోట్ల అకౌంట్లలో భారతదేశంలోనే అత్యధికంగా 74.9 కోట్ల మంది (సుమారు 21%) యూజర్ల అకౌంట్స్ ప్రమాదంలో ఉన్నాయి. తర్వాత ఇండోనేషియా (23.5 కోట్లు), బ్రెజిల్ (20.6 కోట్లు) తరువాత అమెరికా (13.7 కోట్లు), రష్యా (13.2 కోట్లు) ఉంది. ఈ ప్రమాదంలో ఉన్న డాటాలో 81% మంది ఆండ్రాయిడ్ (Android) యూజర్లు ఉన్నారు.సైబర్ సెక్యూరిటీ నిపుణులు కూడా ఈ లోపం గురించి కొన్ని సలహాలు ఇస్తున్నారు. మీ ప్రొఫైల్ ఫోటో, స్టేటస్, About వివరాలను Everybody కి కాకుండా My Contacts లేదా Nobodyకి సెట్ చేసుకోండి. అలాగే 'About' సెక్షన్‌లో మీ రాజకీయ అభిప్రాయాలు లేదా ఇతర వ్యక్తిగత వివరాలను పెట్టకండి అని సూచిస్తున్నారు.

# సంతాన ప్రాప్తిరస్తు.. చాందిని మెరుపులే మెరుపులు



ఒక తెలుగమ్మాయికి అవకాశం రావడమే గొప్ప అనుకుంటే, ఇప్పుడు చాలా మంది తెలుగమ్మాయిలదే గ్లామర్ ఇండస్ట్రీలో హవా. కేవలం తెలుగు చిత్రాల్లోనే కాదు, ఇరుగు పొరుగు భాషల్లోను రాణిస్తున్న తెలుగమ్మాయిలు ఉన్నారు. ఇక సోషల్ మీడియాలు, ఇతర డిజిటల్ మాధ్యమాల ద్వారా తమను తాము పరిచయం చేసుకుని నటీనటులుగా ఎదుగుతున్న వారు ఉన్నారు. ఆరంభం లఘు చిత్రాలతో పాపులరైన చాందిని చౌదరి తెలుగు చిత్రసీమలో కథానాయికగా అవకాశాలు అందుకుని, బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో కెరీర్ బండిని నడిపిస్తున్న సంగతి తెలిసిందే.

కొన్నేళ్లుగా చాందిని చౌదరి నటనా రంగంలో కెరీర్ ని విజయవంతంగా కొనసాగిస్తోంది. కేటుగాడు సినిమాతో తెలుగు సినిమారంగంలోకి ప్రవేశించిన చాందిని విశాఖ అమ్మాయి. బెంగళూరులో చదువుతున్న సమయంలోనే లఘుచిత్రాలలో నటించింది. ఆరంభం యమ్.ఆర్ ప్రొడక్షన్స్ వారి %-%ది వీక్%-% అనే లఘు చిత్రంలో నటించే అవకాశం వచ్చింది. ఆ తర్వాత ప్రేమ ప్రేమ, లవ్ ఎట్ ఫస్ట్ సైట్, ట్రూ లవ్, అప్రోచ్, ప్రపోజల్, మధురం, సాంబార్ ఇడ్లీ, లక్కీ, టూ సైడ్ లవ్, ఫాల్ ఇన్ లవ్, రోమియో జూలియట్ ఇలా వరుసగా లఘు చిత్రాలలో నటించగా చాందినికి గుర్తింపునిచ్చాయి. మొదట్లో యువ కథానాయకుడు రాజ్ తరుణ్ తో కలిసి చాలా లఘు చిత్రాలలో నటించి విజయవంతమైన జంటగా పేరు తెచ్చుకున్నారు. అందులో ఒకటి %-%ది బ్లైండ్ డేట్%-%. అయితే ఈ జంట పెద్ద తెరపై మాత్రం కలిసి నటించలేదు. 2013లో వచ్చిన మధురం లఘుచిత్రంలో చాందిని నటనను చూసిన ముళ్ళపూడి వరా, కె.రాఘవేంద్రరావులు %-%కుందనపు బొమ్మ%-% అనే చిత్రంలో అవకాశం ఇచ్చారు. కానీ కొన్ని కారణాల వల్ల ఆ సినిమా 2015 జనవరిలో ప్రారంభమైంది. 2015లో కేటుగాడు చిత్రంతో తెలుగు చలన చిత్ర తెరకు పరిచయం అయ్యింది. అంతకుముందు తను లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్, ప్రేమ ఇష్క్ కాదల్ సినిమాలలో చిన్న పాత్రలు పోషించింది. ఆ తరువాత కేటుగాడు సినిమాలో కథానాయికగా నటించిన చాందిని బ్రహ్మోత్సవం, శమంతకమణి సినిమాలలో కూడా నటించింది. 2018లో వచ్చిన మను సినిమాలో తన పాత్రకు ప్రశంసలు అందుకుంది. 2020లో సుహాస్ సరసన కలర్ ఫోటో సినిమాలో నటించింది. ఆ తర్వాత కెరీర్ పరంగా



వెనుదిరగలేదు.ఇప్పుడు చాందిని చౌదరి కథానాయికగా, విక్రాంత్ కథానాయకుడిగా నటించిన %-%సంతాన ప్రాప్తిరస్తు%-% విడుదలకు సిద్ధమవుతోంది. మధుర ఎంటర్‌టైన్‌మెంట్, నిర్వి ఆర్ట్స్ బ్యానర్‌లపై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్విప్రసాద్ రెడ్డి నిర్మించిన ఈ సినిమాకు సంజీవ్ రెడ్డి దర్శకత్వం వహించాడు. ఈ సినిమా టీజర్ , ట్రైలర్‌కు ఇప్పటికే అద్భుత స్పందన వచ్చింది. నవంబర్ 14న సినిమా థియేటర్లలో విడుదల కానుంది. సోమవారం సాయంత్రం ప్రీరిలీజ్ వేడుకలో చిత్రబృందం సందడి చేసింది. ఈ వేడుక ఆద్యంతం చాందిని చౌదరి మిరుమిట్లు ప్రత్యేక ఆకర్షణగా మారాయి. అచ్చ తెలుగు అమ్మాయి ట్రెడిషనల్ దుస్తుల్లో ఎంతో అందంగా కనిపించింది. ఈ సినిమా ట్రైలర్ కు పాజిటివ్ బజ్ రావడంతో చిత్రబృందం రెట్టించిన ఆనందంతో ప్రచారంలో వేగం పెంచింది.



# పూరిని ఆపకపోతే ప్రమాదం!



డ్యాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ సినిమాలు ఎలా ఉంటాయి? అన్నది చెప్పాల్సిన పనిలేదు. ఎలాంటి కథనైనా క్రిస్పీగా చెబుతాడు. గ్రిప్పింగ్ స్క్రీన్ ప్లే తో పరుగులు పెట్టిస్తాడు. కటింగ్ కమర్శియల్ గా ఉంటుంది. కథలో అనవసరమైన సన్నివేశాలు..షాట్లు ఇరికించడు. తాను చెప్పాలనుకున్న పాయింట్ సింపుల్ గా ఎలాంటి గందరగోళం లేకుండా చెబుతాడు. ఇదే అతడి ప్రత్యేకత. చాలా వరకూ పూరి సినిమాలకు ఎడిటర్ గా పనిచేసింది మార్తాండ్ కె. వెంకటేష్. తాజాగా పూరి గురించి ఆయన ఓ ఇంట్రెస్టింగ్ విషయం రివీల్ చేసారు. సాధారణంగా దర్శకులంతా ఎడిటింగ్ రూమ్ లో ఎడిటర్ తో పాటు ఉంటారు.

**ఆయన సినిమాకు ఎడిటింగ్ సులభం:**

కానీ పూరి మాత్రం అలా ఉండరన్నారు. ఎడిటర్లను పూరి నమ్ముతాడు. సినిమాను వాళ్ల మీద వదిలేసి వెళ్లిపోతాడు. తాను ఏం చెప్పాలనుకున్నది షూటింగ్ దశలోనూ పూర్తి చేస్తాడు. అక్కడే వేస్టేజ్ లేకుండా చేస్తాడు. దీంతో ఎడిటర్ కి కూడా పెద్దగా పని ఉండదు. అయితే కొన్ని సీన్స్ విషయంలో సింక్ మిస్ అవుతుందని చెబితే మాత్రం పూరి మాట వింటారన్నారు. పూరి గనకు ఎడిటర్ తో పాటు ఉంటే ఓ ఫ్లో వెళ్లిపోతుందన్నారు. కొన్నిసార్లు పూరిని ఆపాలని కూడా అన్నారు. అలా ఆపకపోతే ప్రమాదమంటూ పూరితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

**వాళ్లతో జర్నీ స్లోగా:**

హీరో హైదరాబాద్ నుంచి వైజాగ్ వెళ్లాలనుకుంటే? తర్వాత షాట్లో వైజాగ్ లో ఉంటాడు హీరో. కానీ మిగతా దర్శకుల చిత్రాల్లో అలా ఉండదు. మధ్యలో కొంత జర్నీ ఉంటుంది. దాన్ని హైలైట్ చేస్తారు. శేఖర్ కమ్ములా, బొమ్మరిల్లు భాస్కర్ సినిమాల ఎడిటింగ్ అలాగే ఉంటుందన్నారు. వారిద్దరి నేరేషన్ స్లోగా ఉండటంతో ఎడిటింగ్ కూడా అలాగే ఉంటుందన్నారు. ఒక్కో దర్శకుడితో ఒక్కో శైలి ఉంటుంది. ఆ శైలిని బట్టి ఎడిటర్లు పని చేస్తుంటారు. పూరి ఎడిటర్లు, గీత రచియతలు, సినిమాటోగ్రాఫర్ల విషయంలో కొంత మందిని ఫిక్స్ చేసుకుని ఉంటారు.

**నమ్మకస్తులతోనే డైరెక్టర్లు:**

వీలైనంత వరకూ ఆ టీమ్ నే కొత్త సినిమాలకు పెట్టుకుంటారు. ఇలా పని చేయడం వల్ల దర్శకులకు పనిభారం తగ్గుతుంది. దర్శకుల విజన్ ఎలా ఉంటుందన్నది ఆ టీమ్ ముందే పట్టేస్తుంది కాబట్టి పనుల్లో జాప్యముండదు. అందుకే చాలా మంది దర్శకులు పాత సినిమాల ఆధారంగా కొత్త సినిమాలకు టీమ్ ను ఎంపిక చేస్తారు. సంగీత దర్శకుల విషయంలో మాత్రం కొన్ని రకాల మార్పులు జరుగుతుంటాయి. సుకుమార్ అయితే? దేవి శ్రీ ప్రసాద్ తో తప్ప మరో మ్యూజిక్ డైరెక్టర్ తో పని చేయరు. రాజమౌళి సినిమా చేస్తే కీరవాణి మాత్రమే సంగీతం అందించాలి.